వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 38 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఆగష్టు 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-




## ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు

- అమెరికాసుంకాలపై మోడీ పరోక్ష వ్యాఖ్య
- గుజరాత్ పర్యటనలో పలు అభివృద్ధి పనులకుశ్రీకారం

**అహ్మదాబాద్, ప్రజా స్వేచ్ఛ**

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మరోసారి పరోక్షంగా స్పందించారు. 'ఎంత ఒత్తిడి వచ్చినా.. రైతులకు హాని జరగనివ్వం' అని చెప్పారు. సోమవారం అహ్మదాబాద్ లో రూ.5,400 కోట్ల విలువైన పలు ప్రాజెక్టుల పనులను ప్రధాని మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. అమెరికా సుంకాలపై కీలక వ్యాఖ్యలు

-మిగతా 3 లో

## ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో

# ఉస్మానియా అభివృద్ధి

### తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా



- తెలంగాణ, ఉస్మానియా రెండు అవిభక్త కవలలు
- మహామహులంతా ఇక్కడి నుంచి ఉద్భవించిన వారే
- ఓయూకు పూర్వ వైభం తీసుకొచ్చేలా ప్రతిపాదనలు
- నిధులు ఇచ్చి అభివృద్ధి చేసేందుకు వెనకాడం
- నిరిసించే వారికి సమాధానం చెప్పేందుకు సిద్ధం
- యూనివర్సిటీ అభివృద్ధి అధ్యయనానికి ఇంజనీర్స్ కమిటీ
- ఓయూలో వసతి గృహాలను ప్రారంభించిన సీఎం రేవంత్

**హైదరాబాద్,ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణ పదానికి ప్రత్యామ్నాయం ఉస్మానియా యూనివర్సిటీ అని, తెలంగాణ, ఉస్మానియా రెండూ అవిభక్త కవలల్లాంటివని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చదువుతోపాటు పోరాటాన్ని నేర్పించే గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు.. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం చేతులెత్తేసినప్పుడు.. తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లింది కూడా ఉస్మానియా యూనివర్సిటీ అన్నారు. ఉస్మానియా వర్సిటీలో రూ.90 కోట్లతో నిర్మించిన భవనాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దుందుభి, బీమా వసతి భవనాలను ప్రారంభించిన

-మిగతా 3 లో





## రేఖాగుప్తాకు జడ్ ప్లస్ ఉపసంహారణ

- ఢిల్లీ పోలీసులకే బాధ్యతలు అప్పగింత


**న్యూఢిల్లీ, -**

ఢిల్లీ ముఖ్యమంత్రికి కల్పించిన జెడ్ కేటగిరీ సీఆర్‌పీఎఫ్ సెక్యూరిటీని కేంద్రం ఉపసంహరించుకున్నట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. ఇకపై ఢిల్లీ పోలీసులు ముఖ్యమంత్రికి భద్రత కల్పించనున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన అధికారిక కార్యక్రమంలో ఓ వ్యక్తి సీఎం రేఖా గుప్తాపై దాడి చేసిన నేపథ్యంలో కేంద్రం సీఎంకు జెడ్ క్యాటగిరీ భద్రత కల్పించింది. ముఖ్యమంత్రికీ భద్రత కల్పించాలని కేంద్ర హోమ్ శాఖ సీఆర్‌పీఎఫ్‌ను ఆదేశించింది. ఈ భద్రతను మరింత కాలం పొడిగించొచ్చన్న వార్తలు వెలువడ్డాయి. అయితే, కేంద్రం ఢిల్లీ సీఎం జెడ్ కేటగిరీ భద్రతా

-మిగతా 3 లో

## జైలు నుంచే పాలన చేస్తామంటే ఎలా

- ఎవ్వరైనా జైలుకెళితే పదవి ఊడాల్సిందే
- కేంద్రహోంమంత్రి అమిత్ షా




**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

ముఖ్యమంత్రి అయినా.. ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం ఎలా కుదురుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అది మర్యాదపూర్వకంగా ఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. ఓ ప్రముఖ జాతీయ మీడియా సంస్థ అమిత్ షా ప్రత్యేక ఇంటర్వ్యూ

-మిగతా 3 లో

## భారత్‌పై కావాలనే ట్రంప్ సెకండరీ టారిఫ్స్

- 'రష్యాపై ఒత్తిడి పెంచేందుకు భారత్‌పై అధిక టారిఫ్‌లు
- ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్



**న్యూఢిల్లీ, -**

రష్యా చమురు కొనుగోలును కారణంగా చూపి భారత్ (పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. అమెరికా తీరుపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో భారత్‌పై యూఎస్ విధించిన టారిఫ్‌లపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తాజాగా స్పందించారు.

-మిగతా 3 లో

## రాముడిని ఎగతాళి చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు



**కరీంనగర్,**

కాంగ్రెస్ పార్టీ ఎప్పటినుంచో శ్రీరాముడి పేరును ఎగతాళి చేస్తూ వస్తోందని, రాముడి పట్ల వారికి గౌరవం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం బండి సంజయ్ మాట్లాడుతూ - రామ సేతు కేసులో సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన పార్టీ కాంగ్రెస్‌నే. దశాబ్దాల పాటు- రామ మందిర తలుపులు మూసి వేసింది కూడా కాంగ్రెస్‌నే అన్నారు. రాహుల్ గాంధీ ఒకప్పుడు 'రామ్ మందిర ఉద్యమం ఓడిపోయింది' అని వ్యాఖ్యానించలేదా? హిందువులను 'హింసాత్మకులు' అని అన్నది కాంగ్రెస్‌నే అని గుర్తుచేశారు. రామ్ మందిర ప్రాణ ప్రతిష్ఠకి కూడా హాజరుకావడానికి నిరాకరించింది అదే పార్టీ అని ఆరోపించారు. ఇక ఇప్పుడు రాముని పేరు ప్రస్తావిస్తున్న బీజేపీని కాంగ్రెస్ ఎగతాళి చేస్తోందని, ఇది వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బండి సంజయ్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు

-మిగతా 3 లో

## ఢిల్లీ చేరుకున్న సీఎం రేవంత్, మంత్రులు

- బీసీ బిల్లుపై న్యాయ కోవిదులతో చర్చ
- రాహుల్ ర్యాలీలో పాల్గొనేందుకు నేడు బీహార్‌కు



**న్యూఢిల్లీ, -ప్రజా స్వేచ్ఛ**

ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి,డిప్యూటి సిఎం మల్లు భట్టి క్రమార్క, పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి, పొంగులేటి తదితరులు ఢిల్లీ చేరుకున్నారు. బిసి బిల్లుపై న్యాయ కోవిదులతో చర్చించనున్నారు. అలాగే సీనియర్ లాయర్, ఎంపి అభిషేక్ సింఘ్వీ, జస్టిస్ సుదర్శన్ రెడ్డిలతో చర్చిస్తారు. అలాగే మంగళవారం

-మిగతా 2 లో

## మోసం చేయడంలో

# ఇద్దరు ఇద్దరే

### ఉద్యోగాల పేరుతో టోపీ పెట్టిన మోడీ,రేవంత్

- హామీలు నెరవేర్చకుండా మభ్యపెడుతున్న సీఎం
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్,-ప్రజా స్వేచ్ఛ**

దేశంలో ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రధాని మోదీ, తెలంగాణలో రెండు లక్షల ఉద్యోగాలని సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ధ్వజమెత్తారు. పేదల ఖాతాల్లో రూ.15లక్షలు వేస్తామని మోదీ.. రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని రేవంత్ చెప్పి మాట తప్పారని విమర్శించారు. ఇద్దరూ కలిసి ఒక్క హామీని కూడా ఎందుకు అమలు చేయలేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ భవన్‌లో ఆర్మూర్ నేలను ఉద్దేశించి కెటిఆర్ మాట్లాడారు.బడే భాయ్, చోటే భాయ్ ఇద్దరూ కలిసి పనిచేస్తున్నారని , ఆయన సంచలన వ్యాఖ్యలు

-మిగతా 3 లో



## బీఆర్ఎస్ అదృశ్యం ఖాయం

- రాజకీయ ముఖచిత్రంలో ఇక మాయం
- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ వ్యాఖ్యలు

**కరీంనగర్, -ప్రజా స్వేచ్ఛ**

రాజకీయ ముఖచిత్రంలో బీఆర్ఎస్ అనే పార్టీ ఉండదని టీ- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కరీంనగర్ కార్యకర్తల మీటింగ్ లో మాట్లాడిన ఆయన.. పది మంది ఎమ్మెల్యే సంగతి తర్వాత ముందు మీ కుటుంబ ఆస్తుల పంచాయితీ తేల్చుకోవాలని కేటీఆర్ పై సెటైర్ వేశారు. లక్షా 20 వేల కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందన్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ వాళ్లను దోషులుగా తేలిస్తే సుప్రీం కోర్టును ఆశ్రయించారు కానీ ప్రజా క్షేత్రంలో బీఆర్ఎస్ కు శిక్ష తప్పదని హెచ్చరించారు. గత పదేళ్లలో తెలంగాణలో శాంపిల్ సర్కార్ నడిపించారని ఫైర్ అయ్యారు. సమావేశంలో మాట్లాడిన

-మిగతా 3 లో

## ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ మోసం

- నిలదీస్తారనే భయంతో విద్యార్థుల అరెస్ట్
- సీఎం ఓయూ పర్యటనపై హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్,**

సీఎం రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ- పర్యటన నేపథ్యంలో విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజంపై నిషేధాజ్ఞలు

-మిగతా 3 లో

# దివ్యాంగులను ఎగతాళి చేసిన కమెడియన్లపై సుప్రీం సీరియస్



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

దివ్యాంగులను ఎగతాళి చేసినందుకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఐదుగురు కమెడియన్లను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. 'ఇండియాస్ గాట్ లేటెంట్' షోలో దివ్యాంగులపై సమయ్ రైనా, విపున్ గోయల్, బల్‌రాజ్ పరంజీత్ సింగ్ ఘాయ్, సోనాలీ ఠక్కర్, నిశాంత్ జగదీశ్ తన్వర్ చేసిన వ్యాఖ్యలను ఖండించింది.వీరిపై జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించింది. దివ్యాంగుల హక్కులపై అవగాహన కల్పించేందుకు తమ వేదికలను ఏ విధంగా ఉపయోగించగలరో అఫిడవిట్‌ను ఇవ్వాలని ఆదేశించింది.

# సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జిలు

**న్యాయమూర్తులు ఆలోక్ అరాధే, విపుల్ పంచోలీలకు పదోన్నతి**

**సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు**

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం సిఫారసు చేసింది. బాంబే హైకోర్టు ప్ర ధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అ రాధే, పాట్నా హైకోర్టు సీజే జస్టిస్ విపుల్ ఎం పంచోలీలను సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమించాలని కోరింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్‌లు సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, జేకే మహేశ్వరి, బీవీ నాగరత్నలతో కూడిన సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం ఈ నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టులో మొత్తం 34 మంది న్యాయమూర్తులు ఉండాలి. వీరిద్దరి నియామకంతో జడ్జిల సంఖ్య 34కు చేరుతుంది. జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి సీజేఐ పదవిని చేపడితే, 2031 మే నెలలో పదవీ విరమణ చేస్తారు. ఆయన తర్వాత సీజేఐగా జస్టిస్ పంచోలీ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంటుంది.



**తెలంగాణ హైకోర్టుతో అనుబంధం**

జస్టిస్ అరాధే అనేక హైకోర్టుల్లో సేవలందించారు. ఆయన ముఖ్యంగా సివిల్, కాన్‌స్టిట్యూషనల్, ఆర్బిట్రేషన్, కంపెనీల సంబంధిత వ్యాజ్యాలకు న్యాయవాదిగా మధ్యప్రదేశ్ హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2007 ఏప్రిల్‌లో సీనియర్ అడ్వకేట్‌గా డిజిగ్నేట్ అయ్యారు. 2009 డిసెంబరులో మధ్య ప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2011 ఫిబ్రవరిలో శాశ్వత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2016 సెప్టెంబరులో జమ్ముకశ్మీరు హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఈ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కూడా పని చేశారు. 2018 నవంబరులో ఆయన కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2022 జూలై-అక్టోబరు మధ్య కాలంలో ఈ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా 2023 జూలైలో నియమితులయ్యారు. ఓ ఏడాది తర్వాత బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

**న్యాయవాద వృత్తి నుంచి న్యాయమూర్తిగా..**

జస్టిస్ పంచోలీ గుజరాత్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. ఏడేళ్లపాటు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. 2014 అక్టోబరులో గుజరాత్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2016 జూన్‌లో పర్మనెంట్ జడ్జి అయ్యారు. 2023 జూలైలో పాట్నా హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. 2025 జూలైలో పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# గాజా ఆస్పత్రిపై ఇజ్రాయెల్ దాడులు..

**జర్నలిస్ట్‌లు సహా 15 మంది మృతి**



**గాజా -ప్రజా స్వేచ్ఛ**

హమాస్ అంతమే లక్ష్యంగా గత 22 నెలలుగా గాజా నగరంపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. తాజాగా గాజా నగరంలోని పలు ప్రాంతాలపై ఐడీఎఫ్ దాడులకు తెగబడింది. నాజర్ ఆస్పత్రిపై సోమవారం జరిపిన దాడుల్లో ముగ్గురు జర్నిలిస్టులు సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పాలస్తీనా ఆరోగ్య అధికారులు తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టుల్లో ఒకరు రాయిటర్స్‌కు చెందిన హతేమ్ ఖలీద్, ఓ ఫొటోగ్రాఫర్ అని స్థానిక వార్తా సంస్థ తెలిపింది. 2023 అక్టోబర్ 7న మొదలైన ఈ యుద్ధంలో ఇప్పటి వరకూ గాజాలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 62 వేలు దాటింది. లక్షలాది మంది గాయపడ్డారు. ఇక ఈ యుద్ధంలో సుమారు 200 మందికిపైగా మీడియా వర్కర్స్ మరణించారు.

# భారత కార్మిక శక్తికి రష్యాలో డిమాండ్

**భారత రాయబారి వినయ్ కుమార్**

**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

రష్యాలో భారత కార్మిక శక్తికి డిమాండ్ పెరుగుతోంది. రష్యన్ కంపెనీలు ముఖ్యంగా యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోని సంస్థలు భారతీయులను నియమించుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయని అక్కడి భారత రాయబారి వినయ్ కుమార్ తెలిపారు. రష్యాలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు భారతీయుల సంఖ్య పెరుగుతుండటంతో కాన్సులర్ సేవలను మరింత విస్తరిస్తున్నట్లు చెప్పారు.అమెరికా, బ్రిటన్ తదితర పాశ్చాత్య దేశాలు వలసలపై ఆంక్షలు విధిస్తున్న వేళ ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రష్యాలో మానవ వనరుల అవసరం ఉందని, భారత్ వద్ద నైపుణ్యం కలిగిన కార్మిక శక్తి ఉందని, ఈ క్రమంలోనే స్థానిక చట్టాలను



అనుసరించి కంపెనీలు భారతీయులను నియమించుకుంటున్నాయని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వినయ్ కుమార్ చెప్పారు.రష్యాకు వలస వచ్చిన వారిలో ఎక్కువ మంది నిర్మాణ, వస్త్ర రంగాల్లో ఉపాధి పొందుతున్నారని, యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో భారతీయులకు డిమాండ్ పెరుగుతోందని అన్నారు. స్థానికంగా భారతీయ కార్మికుల సంఖ్య పెరుగుతుండటంతో పాస్‌పోర్ట్‌ల పొడిగింపు వంటి కాన్సులర్ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. కాగా అధికారిక లెక్కల ప్రకారం.. రష్యాలో దాదాపు 14 వేల మంది భారతీయులు ఉన్నారు. స్థానిక విద్యాసంస్థల్లో దాదాపు 4,500 మంది మన విద్యార్థులు చదువుతున్నారు.ఉక్రెయిన్ యుద్ధానికి తోడు యువ రష్యన్లు ఫ్యాక్టరీల్లో పని చేసేందుకు విముఖత చూపుతుండటం వంటి కారణాలతో 2030కల్లా రష్యాలో 31 లక్షల మంది కార్మికులకు కొరత ఏర్పడనున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో ఇక్కడి పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మిక కొరతను తీర్చడానికి ఈ ఏడాది చివరికల్లా నిపుణులైన 10 లక్షల మంది భారతీయ కార్మికులను తీసుకోవాలని మాస్కో వ్యూహకర్తలు భావిస్తున్నట్లు ఈ మధ్య వార్తా కథనాలు వెలువడ్డాయి.

# మోదీ డిగ్రీ వివరాలు వెల్లడించనక్కర్లేదు

**సీఐసీ ఉత్తర్వుపై ఢిల్లీ హైకోర్టు తీర్పు**



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

ప్రధాని నరేంద్ర మోదీ డిగ్రీకి సంబంధించిన వివరాలు బయటపెట్టాలని ఆదేశిస్తూ కేంద్ర సమాచార కమిషనర్ (సీఐసీ) గతంలో ఇచ్చిన ఆదేశాలను ఢిల్లీ హైకోర్టు సోమవారం పక్కనపెట్టింది. ప్రధాని మోదీ గ్రాడ్యుయేషన్ డిగ్రీ వివరాలను ఢిల్లీ యూనివర్సిటీ వెల్లడించాల్సిన అవసరం లేదని కోర్టు స్పష్టం చేసింది. తాను డిగ్రీ పాసైనట్లు ప్రధాని మోదీ ప్రకటించిన దరిమిలా 1978లో డిగ్రీ పాసైన విద్యార్థులందరి రికార్డులను తనిఖీ చేయడానికి అనుమతినిస్తూ 2016లో సీఐసీ ఉత్తర్వు జారీ చేసింది.. ఈ ఉత్తర్వులను ఢిల్లీ యూనివర్సిటీ సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేయగా 2017 జనవరిలో కేసు విచారణ మొదటిరోజునే ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. తెలుసుకోవాలనే హక్కు కన్నా గోప్యతా హక్కు బలమైనదని ఢిల్లీ యూనివర్సిటీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు.

# రాహుల్‌గాంధీ ఒక అబద్ధాలకోరు..

**ఓట్ల చోరీ ఆరోపణలపై 'మహా' సీఎం ఆగ్రహం**



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

అధికార బీజేపీ ఎన్నికల సంఘం తో కుమ్మక్కై ఓట్ల అవకతవకలకు పాల్పడినట్లు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. రాహుల్ గాంధీ ఒక అబద్ధాల కోరు అని మండిపడ్డారు. రాహుల్ గాంధీ ఆరోపణలను తోసిపుచ్చారు.సోమవారం ఫడ్నవీస్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలు ప్రజల్లోకి తప్పుడు సమాచారాన్ని తీసుకెళు తున్నారన్నారు. రాహుల్ వట్టి అబద్దాల కోరని, ఆయన నిరంతరం అసత్యాలను ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాహుల్ మాట్లాడేదంతా అక్షర సత్యమని కొందరు రాష్ట్ర నాయకులు నమ్మడం తనను కలచివేసిందని చెప్పారు. తప్పుడు సమాచారానికి ఆధారాలుండవని, అబద్ధాలపై నిర్మించిన కోట ఎన్నటికీ నిలువదని, అది కచ్చితంగా కూలిపోతుందని ఫడ్నవీస్ వ్యాఖ్యానించారు. ప్రజల ఓట్లు గెలువాలంటే వారి నమ్మకాన్ని సంపాదించాలనే విషయాన్ని రాహుల్ గాంధీ గ్రహించలేకపోతున్నారని అన్నారు.

# రేపటి నుంచి 50 శాతం సుంకాలు

**అమల్లోకి రానున్న ట్రంప్ సర్కారు టారిఫ్‌లు**

**ఎగుమతిదారులతో నేడు పీఎంవో సమావేశం**



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

ప్రస్తుతమున్న సుంకాలను ట్రంప్ ప్రభుత్వం రెట్టింపు చేయడంతో బుధవారం(ఆగస్టు 27) నుంచి అమెరికాలోకి ప్రవేశించే భారతీయ వస్తువులపై 50 శాతం సుంకం పడనున్నది. ఇది ఎగుమతిదారులపై మోయలేని భారాన్ని వేయనున్నది. అమెరికా విధించిన భారీ సుంకాలు ప్రభావాన్ని ఎదుర్కొంటున్న భారతీయ ఎగుమతిదారుల కోసం తీసుకుంటున్న చర్యలను సమీక్షించేందుకు ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంవో) మంగళవారం ఓ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నది. ప్రధానమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి ఈ సమావేశానికి అధ్యక్షత వహించే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

**ఏఏ రంగాలపై ప్రభావం?**


అమెరికా విధించిన 50 శాతం సుంకాలు అమలులోకి వస్తే వ్యవసాయం, ఫార్మా, జౌళి, చర్మ ఉత్పత్తులపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎగుమతులపైనే ఆధారపడిన పరిశ్రమలు, చిన్న, మధ్యతరహా సంస్థ(ఎస్ఎంఈలు)లపైనే ప్రధానంగా దృష్టి సారించాలని ప్రభుత్వ వ్యూహమని అధికారులు తెలిపారు. మంగళవారం జరిగే సమావేశంలో ఎగుమతిదారులకు ఎలాంటి భరోసా కల్పించాలో ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది.

# మార్కెట్‌లో ఎక్కడ బెస్ట్ డీల్‌కు దొరికితే అక్కడే చమురు కొంటాం

**యూఎస్ టారిఫ్‌లపై భారత్**

**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

రష్యా చమురు కొనుగోలును కారణంగా చూపి భారత్ పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అదనపు టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. అమెరికా తీరుపై రష్యాలోని భారత రాయబారి తాజాగా ఘాటుగా స్పందించారు. ఈ మేరకు అమెరికా నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.యూఎస్ టారిఫ్ ఆంక్షలపై మాస్కోలోని భారత రాయబారి వినయ్ కుమార్ మాట్లాడుతూ.. ఎక్కడ బెస్ట్ డీల్ ఉంటే అక్కడి



నుంచే భారత్ చమురు కొనుగోలు చేస్తుందని కుండబద్దలు కొట్టారు. 'టారిఫ్‌ల విషయంలో అమెరికా నిర్ణయం అన్యాయమైనది, అసమంజసం. ఇది ఫెయిర్ ట్రేడ్ రూల్స్‌ను అణచివేయడమే. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు ఇంధన భద్రత కల్పించడమే మా మొదటి ప్రాధాన్యం. దేశ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా మార్కెట్‌లో బెస్ట్ డీల్‌తో ఎక్కడ చవకగా దొరికితే అక్కడ నుంచే భారత్ చమురు కొనుగోలు చేస్తుంది. ప్రస్తుతం అదే జరుగుతోంది. రష్యాతో భారత సహకారం కారణంగానే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు స్థిరంగా ఉన్నాయి' అని భారత రాయబారి స్పష్టం చేశారు.

# ప్రాణాలు హరిస్తున్న వరకట్న భూతం

**న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ**

సమాజంలో ఎన్నో సంస్కరణలు వచ్చినా, మహిళల సాధికారత పెరుగుతున్నా.. వ్యాపారంగా మారిపోయిన వివాహం, సామాజిక అత్యాశ మహిళలను వరకట్న దురాచారానికి సమిధలుగా మారుస్తున్నాయి. విద్యావంతులు, సంపాదనపరులైన మహిళలు కూడా వరకట్న వేధింపులకు తాళలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.వరకట్న నిషేధ చట్టం సరిగ్గా అమలు కాకపోవడం, వేధింపులపై కేసులు సరిగా నమోదు కాకపోవడం, నమోదైన వాటిలో శిక్షలు పడిన కేసుల సంఖ్య కేవలం 4 శాతం కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.

## ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గేది లేదు

(మొదటి తరువాయి)

చేశారు. ఎంత ఒత్తిడి వచ్చినా.. తమ ప్రభుత్వం తట్టు-కునే బలాన్ని పెంచుకుంటూనే ఉంటు-ందని అన్నారు. చిన్న పారిశ్రామికవేత్తలు, రైతులు, పశుపోషకులకు ఎటు-వంటి హాని జరగనివ్వదని అన్నారు. నేడు ప్రపంచంలో, ప్రతి ఒక్కరూ ఆర్థిక ప్రయోజనాల ఆధారంగా రాజకీయాలు చేయడంలో బిజీగా ఉన్నారు. ఈ అహ్మదాబాద్ గడ్డ మీద నుంచి చెబుతున్నా.. చిన్న పారిశ్రామికవేత్తలు, రైతులు, పశుపోషకులు.. అందరికీ, నేను మీకు పదే పదే హామీ ఇస్తున్నా. మీ ప్రయోజనాలు మోడీకి అత్యంత ముఖ్యమైనవి. ఎంత ఒత్తిడి వచ్చినా, తట్టు-కునే శక్తిని మనం పెంచుకుంటూనే ఉంటాం అని చెప్పారు. కాగా, రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేయాలంటూ డోనాల్డ్ ట్రంప్.. భారత్ పై భారీ సుంకాలు విధించాడు. రెండు సార్లు 25 శాతం చొప్పున మొత్తం 50 శాతం అదనపు సుంకాలను విధించాడు. తాము చెప్పినట్లు- వినకపోతే.. భారత్ మరిన్ని సుంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రంప్ వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే.

## జైలు నుంచే పాలన చేస్తామంటే ఎలా

(మొదటి తరువాయి)

ఇచ్చారు. ఈసందర్భంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 2013 నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ధ్వజమెత్తారు. రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్ గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుందని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సీఎం, పీఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మా పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదని అమిత్ షా అన్నారు.ప్రధాని గానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే.. ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే.. చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం. చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోదీనే దీన్ని సవరణలో చేర్చారు. రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది.

## భారత్‌పై కావాలనే ట్రంప్ సెకండరీ టారిఫ్స్

(మొదటి తరువాయి)

ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యాను అడ్డుకునేందుకే అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌పై అధిక టారిఫ్‌లు విధించినట్లు చెప్పుకొచ్చారు.ఎన్‌బీసీ న్యూస్‌కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జేడీ వాన్స్ మాట్లాడుతూ.. 'రష్యాపై ఒత్తిడి పెంచేందుకు అధ్యక్షుడు ట్రంప్ కావాలనే భారత్‌పై అధిక టారిఫ్స్ విధించారు. ఆయిల్ ద్వారా వస్తున్న ఆదాయాన్ని ఆపాలనే లక్ష్యంతోనే ఈ చర్యలు. చమురు నుంచి వచ్చే ఆదాయం తగ్గిపోతే ఉక్రెయిన్‌పై దాడులు చేయడం మాస్కోకు కష్టతరమవుతుంది. దాడులను ఆపమని రష్యాను బలవంతం చేయడానికి ట్రంప్ దూకుడుగా ఆర్థిక ఒత్తిడి విధానాన్ని అవలంభించారు. భారత్‌పై సెకండరీ టారిఫ్స్ ఇందులో భాగమే. హత్యలను ఆపితే రష్యాను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోకి తిరిగి ఆహ్వానించొచ్చు. కానీ, దాడులు కొనసాగితే అది ఒంటరిగా ఉండాల్సి వస్తుంది' అని జేడీ వాన్స్ తెలిపారు.

## రేఖాగుప్తాకు జడ్ ప్లస్ ఉపసంహారణ

(మొదటి తరువాయి)

ఏర్పాట్లను తొలగించేందుకు నిర్ణయించింది. ఇకపై సీఎం భద్రత వ్యవహారాలను ఢిల్లీ పోలీసులు పర్యవేక్షించనున్నారు. సీఎం రేఖ గుప్తా సివిల్ లైన్స్‌లోని 'జన్ సున్‌వాయి' కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో ఈ దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సఖ్రియా రాజేశ్‌భాయ్ ఖిమ్జీ ఆటోడ్రైవర్ అని, అతడు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన వాడని పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తులో భాగంగా పోలీసులు.. సీఎం నివాసంలో భద్రతా లోపాలను కూడా గుర్తించారు. ఈ లోపాల కారణంగా పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను హోం మంత్రిత్వ శాఖకు పంపించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## రాముడిని ఎగతాళి చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

(మొదటి తరువాయి)

రాముని అవమానించడం అలవాటే. కానీ బీజేపీకి రాముడు అంటే ప్రాణం, విశ్వాసం. రాముడు రాజకీయాల కోసం కాదు... ఈ దేశపు గుండె చప్పుడు అని ఆయన స్పష్టం చేశారు. రామ మందిర నిర్మాణం, ప్రాణ ప్రతిష్ఠ వంటి సందర్భాల్లో కాంగ్రెస్ వైఖరి ప్రజలు మర్చిపోలేరని, రాముని పట్ల ఉన్న ఆప్యాయతను బీజేపీ ఎప్పటికీ రాజకీయం చేయదని బండి సంజయ్ పునరుద్ఘాటించారు.

## బీఆర్‌ఎస్ అదృశ్యం ఖాయం

(మొదటి తరువాయి)

మహేశ్ కుమార్ గౌడ్.. జనహిత పాదయాత్ర వల్ల బీజేపీ, భారాస కు కడుపు నొప్పి వస్తుంది. కార్యకర్త త్యాగ ఫలితంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రజల్లో జరుగుతున్న వాస్తవాలను తెలుసుకునేందుకే జనహిత పాదయాత్ర చేపట్టాం. ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న కార్యకర్తలను వదిలిపెట్టుకోబోమన్నారు. పేదవారి జీవిత కాల స్వప్నమైన ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నాం. పథకాలు రాని 10 శాతం వారే ఇబ్బంది పెడుతున్నారు .దీనిపై కార్యకర్తలు దృష్టి పెట్టాలి. బండి సంజయ్ వ్యాఖ్యల వల్లే బీసీ బిల్లు పెండింగ్ లో ఉంది. దేవుడి పేరు చెప్పకుండా బండి సంజయ్ మళ్ళీ గెలుస్తారా అని ప్రశ్నించారు. .అంబానీ, అదానీలకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతుంది. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గలేదు. 12 ఏళ్లలో రాష్ట్రానికి బీజేపీ ఏం చేసింది.? రాష్ట్రంలో జరిగిందంతా కాంగ్రెస్ హయంలోనే జరిగింది. 42 బీసీ రిజర్వేషన్స్ లో ముస్లింలకు 5.8 శాతం మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటికే 4 శాతం ఉంది. అయినా బీజేపీ 10 శాతం అని తప్పుడు ప్రచారం చేస్తోంది. బీజేపీ ఎంపీల వల్ల బీసీ ప్రజలకు అన్యాయం జరుగుతుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు .కరీంనగర్ బిజెపి ఎంపిలు దొంగ ఓట్లతో గెలిచారని టిపిసిసి ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. దొంగ ఓట్లతో గెలిచినట్టు- తమ దగ్గర ఆధారాలున్నాయని అన్నారు. మహేష్ మీడియాతో మాట్లాడుతూ..బిజెపి కేంద్రమంత్రి బండి సంజయ్ కి మెజారిటీ- ఎలా వస్తుంది? అని ఒకే డబుల్ బెడ్ రూమ్ ఇంట్లో 69 ఓట్లు- ఎలా ఉంటాయని ప్రశ్నించారు. బండి సంజయ్ అసలు బిసినే కాదని ఆయన దేశ్ ముఖ్ అని తెలియజేశారు. తెలంగాణలో ఓట్ల చోరిపై ఇసిని కలుస్తామని అన్నారు. ఎన్నికల సంఘం ఇలా ఉండటం మన దౌర్భాగ్యం అని ఆవేదనను వ్యక్తం చేశారు. నిజామాబాద్ ఎంపి అర్వింద్ గెలుపుపై కూడా అనుమానం ఉందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కొత్తగా కాంగ్రెస్ పార్టీలో చేరిన వాళ్లు 10 నెలలు ఖచ్చితంగా పార్టీ కోసం పనిచేయాలని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చే వారికి అవకాశాలు ఉంటాయి కానీ పాత వారికి ముందు అవకాశం వస్తుందన్నారు. కరీంనగర్ లో కార్యకర్తల మీటింగ్లో మాట్లాడిన మీనాక్షి నటరాజన్.. ఓట్ చోరీ నీ ఆపాలంటే ఓటర్ లిస్ట్ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఆక్స్‌ఫర్డ్ స్థాయిలో ఉస్మానియా అభివృద్ధి

(మొదటి తరువాయి)

అనంతరం.. డిజిటల్ లైబ్రరీ, రీడింగ్ రూమ్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, కోదండరామ్, ఓయూ వీసీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించిన సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. కొందరు వ్యక్తులు.. ఉస్మానియా యూనివర్సిటీని కాలగర్భంలో కలపాలని చూశారని మండిపడ్డారు. కానీ ఓయూకు పూర్వ వైభవం తీసుకురావాలని తాము నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆ క్రమంలో 108 ఏళ్ల చరిత్ర కలిగిన వర్సిటీకి దళితుడిని వీసీ చేసి చూపించామన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి పురిటి గడ్డ ఉస్మానియా వర్సిటీనేనని గుర్తు చేశారు. యూనివర్సిటీలు సమస్యలపై చర్చలకే కాదు..సైద్ధాంతిక అంశాలకు వేదిక సైతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక, సాంకేతిక అంశాలపై చర్చలు జరపాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. 1938 సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిలూదిన గడ్డ ఇది.. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన శివరాజ్ పాటిల్, పీవీ నర్సింహారావు ఈ యూనివర్సిటీ విద్యార్థులే.. ఉత్తమ పార్లమెంటే రియన్‌గా గుర్తింపు పొందిన జైపాల్ రెడ్డి ఈ యూనివర్సిటీ విద్యార్థినే.. తెలంగాణ నలుమూలలా ఏ సమస్య వచ్చినా మొదట చర్చ జరిగేది యూనివర్సిటీలోనే..అని అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంతాచారిది ఉస్మానియా యూనివర్సిటీనే.. యాదయ్య, ఇషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి రాష్ట్ర సాధనలో సమిధలయ్యారు.. ఎంతో మంది మేధావులను అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీది.. గత పదేళ్ల పాలనలో ఉస్మానియా యూనివర్సిటీని నిర్వీర్యం చేసే కుట్ర జరిగింది.. ఉస్మానియా యూనివర్సిటీకి పూర్వ వైభవం తీసుకురావాలని మేం ఆలోచన చేశాం.. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించాం.. చదువుకుని చైతన్యం ఉన్న వారిని వీసీలుగా నియమించాం.. తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచే మేధా సంపత్తిని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆశిస్తున్నాం.. అన్నారు. దేశానికి యువ నాయకత్వం అవసరం.. దేశంలో 60 శాతం జనాభా 35 ఏళ్ల లోపు వారే.. ఇది మన దేశ సంపద.. 21 ఏళ్ల వయసులో దేశానికి సేవలంది

స్తున్నప్పుడు.. 21 ఏళ్ల యువకులు శాసన సభలో ఎందుకు అడుగుపెట్టకూడదు?.. తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఆవేదన కలుగుతోంది.. యువతను గంజాయి, డ్రగ్స్ వ్యసనాలు పట్టి పీడిస్తున్నాయి.. గంజాయి, డ్రగ్స్ యువతను నిర్వీర్యం చేస్తున్నాయి.. ఆ వ్యసనాల నుంచి యువతను బయటపడేలా చేయాలి.. చదువు, చైతన్యం ఉంటేనే సమాజంలో రాణిస్తారు.. నా దగ్గర పంచడానికి భూములు లేవు, ఖజానా లేదు మీకు నేను ఇవ్వగలిగింది విద్య ఒక్కటే.. అన్నారు. మీ తలరాతలు మార్చేది చదువొక్కటే.. చదువు ఒక్కటే మిమ్మల్ని ధనవంతుల్ని చేస్తుంది, గుణవంతులను చేస్తుంది.. పేదరికం మాకు కొత్త కాదు.. ఆ పేదరికాన్ని చూసి వచ్చినవాళ్ళం.. పేదరికాన్ని పారద్రోలడం మాకంటే ఎక్కువ ఎవరికీ తెలియదు.. యూనివర్సిటీ అభివృద్ధి అధ్యయనానికి ఇంజనీర్స్ కమిటీ వేయాలని అధికారులను ఆదేశిస్తున్నా.. ఉస్మానియా యూనివర్సిటీని స్టాన్ ఫర్డ్, ఆక్స్ ఫర్డ్ స్థాయిలో తీర్చిదిద్దుతాం.. ఉస్మానియా యూనివర్సిటీ చరిత్రకు నిలువెత్తు సాక్షిగా నిలవాలి.. ఉస్మానియా యూనివర్సిటీ- లేకపోతే తెలంగాణ రాష్ట్రమే లేదు.. యూనివర్సిటీ- అభివృద్ధికి ఏం కావాలో అడగండి.. అంచనాలు తయారు చేసి ఇవ్వండి..అని అన్నారు. మళ్లీ యూనివర్సిటీకి వస్తా.. ఆర్ట్స్ కాలేజీ వద్ద మీటింగ్ పెట్టి నిధులు మంజూరు చేస్తా..పోలీసులకు నేను ఆదేశిస్తున్నా.. ఆ రోజు యూనివర్సిటీ లో ఒక్క పోలీస్ కనిపించొద్దు.. నిరసన తెలిపే వారిని నిరసన తెలపనివ్వండి.. నేను రావొద్దని అడ్డుకునే వారికి సమాధానం చెప్పే చిత్తశుద్ధి నాకుంది.. కొంతమంది రాజకీయ నాయకులకు పదవులు పోయాయన్న ఆవేదన ఉంటుంది.. వాళ్ల కొడుకులను ఏదో చేద్దామనుకుంటే ఏదో అవుతున్నారని బాధ ఉంటది.. వారి ఉచ్చులో మీరు పడొద్దు.. సమస్య ఉంటే మాకు చెప్పండి.. మా మంత్రులు మీకు అందుబాటులో ఉంటారు.. కోదండరామ్ సార్ పై కుట్ర చేసి సుప్రీం కోర్టుకు వెళ్లి పదవి తొలగించారు.. ఇదేం పైశాచిక ఆనందం.. మళ్లీ కోదండరాం సార్ కు ఎమ్మెల్సీ ఇస్తాం..అని ప్రకటించారు. అపోహలకు లోను కాకండి.. అబద్ధాల సంఘం చెప్పే మాటలు నమ్మొద్దు..వాట్సాప్, సోషల్ మీడియాలో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో సెంట్రల్ యూనివర్సిటీలో సింహాలు, ఏనుగులు ఉన్నాయని ప్రచారం చేసి అడ్డుకున్నారు.. తెలంగాణలో సింహాలు, ఏనుగులు లేనేలేవు.. మానవ రూపంలో ఉన్న మృగాలు ఉన్నాయి.. వాళ్లు తెలంగాణ సమాజానికి పట్టిన చెదలు లాంటివారు.. వాళ్లు తెలంగాణ సమాజం బాగు కోరుకోరు.. వాళ్లు మళ్లీ వస్తే ఉస్మానియా యూనివర్సిటీని ఉండనివ్వరు.. మీ చదువుకు ఏం కావాలో అడగండి.. ఉస్మానియా యూనివర్సిటీని అభివృద్ధి చేసే బాధ్యత నాది అని సీఎం రేవంత్ తెలిపారు.


# ఢిల్లీ చేరుకున్న సీఎం రేవంత్, మంత్రులు

(మొదటి తరువాయి)

బీహార్‌లో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న ర్యాలీలో సిఎం తదితర మంత్రులు పాల్గొంటారు. ఇకపోతే వెనుకబడిన వర్గాల వారికి 42 శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసులో ఇంప్లీడ్ కానుందని సమాచారం. రాష్ట్రపతి గవర్నర్ కు పంపిన బిల్లుల ఆమోదంపై రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఆరు నెలల క్రితం బీసీలకు 42??? రిజర్వేషన్లు కేటాయిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసింది. దానిని గవర్నర్ కు పంపగా.. ఆయన కేంద్ర హోంశాఖ ద్వారా రాష్ట్రపతికి పంపారు. తమిళనాడు, కేరళ కేసుల్లో తెలంగాణ కూడా ఇంప్లీడ్ కావాలని బా విస్తోంది. ఈ మేరకు సుప్రీంకోర్టుద్వారా కేంద్రపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించనుంది. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. న్యాయ నిపుణులతో చర్చించనున్నట్టు- తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల కోసం ఎంపిక చేసిన మంత్రి వర్గ ఉపసంఘం సభ్యులు మల్లు భట్టి విక్రమార్క. ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఢిల్లీ వెళ్లారు. ఉదయం సీఎం రేవంత్ రెడ్డి ఈ మంత్రులకు పర్సనల్ గా కాల్ చేసి ఢిల్లీకి రావాలని కోరారు. దీంతో వరంగల్ పర్యటనలో ఉన్న సీతక్క, కరీంనగర్ పాదయాత్రలో ఉన్న పొన్నం ప్రభాకర్ సహా మిగిలిన మంత్రులు హుటాహుటిన ఢిల్లీ బయల్దేరివెళ్లారు. అక్కడ న్యాయ కోవిదులతో చర్చించి సుప్రీంకోర్టు లో పెండింగ్ లో ఉన్న కేరళ, తమిళనాడు కేసులో ఇంప్లీడ్ కానున్నారు. సెప్టెంబర్ 30 లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు గడువు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు- పూర్తి చేసింది. 2023 డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీ సూచన మేరకు కులగణన నిర్వహించి బీసీల లెక్క తేల్చింది. ఈ మేరకు 42 రిజర్వేషన్లు కేటాయిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. దీనిని ఎలాగైనా అమల చేయాలని చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్న ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాయడంతోపాటు- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా సైతం నిర్వహించింది. పార్లమెంటు-లో నిరసన వ్యక్తం చేసింది. రాష్ట్రపతిని కలిసి నేరుగా విజ్ఞప్తి చేసేందుకు ప్రయత్నించగా అపాయింట్ మెంట్ దొరకలేదు. వీలైనంత త్వరగా బీసీ రిజర్వేషన్లను కొలిక్కి తేవాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.

## మోసం చేయండలో ఇద్దరు ఇద్దదే

(మొదటి తరువాయి)




చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ , సీఎం రేవంత్‌రెడ్డి కలిసి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని ఆటలో అరటిపండుగా మార్చారని ఎద్దేవా చేశారు. పెద్ద మోదీ, చిన్న మోదీ ఒకే రకంగా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇద్దరూ కలిసి రాహుల్‌కు పెద్ద షాక్ ఇవ్వటం ఖాయమని జోస్యం చెప్పారు. ఉస్మానియాలో రేవంత్ రెడ్డి, కేసీఆర్ ప్రభుత్వం పునాది వేసిన భవనాలను ప్రారంభించారు. రేవంత్ రెడ్డి వికృత మాటలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. గత ముఖ్యమంత్రులతో పోల్చి చూస్తూ ప్రజలు రేవంత్ రెడ్డిని బండ బూతులు తిడుతున్నారు. రేవంత్ రెడ్డి జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారు. మా ప్రభుత్వం నిర్మించిన భవనాలకు రిబ్బన్ కట్ చేయడానికి తాపత్రయ పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీలు కాంగ్రెస్, బీజేపీ. రెండూ దొందూ దొందే. పెట్టు-బడులు, పరిశ్రమలు, విభజన హామీలు - అన్నింటిలోనూ బీజేపీ తెలంగాణకు మోసం చేసింది' అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోంది. 20 నెలల కాంగ్రెస్ పాలన నచ్చుకుంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయాలి. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు ఈ ప్రభుత్వం చేయించడం లేదు. మోదీ, చంద్రబాబు ఆదేశాల మేరకు గోదావరి నీళ్లను దిగువకు పంపించేందుకు రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారు. గోదావరి నీళ్లు బకనకచెర్ల ప్రాజెక్టుకు, అక్కడి నుంచి తమిళనాడుకు వెళ్లాలని బీజేపీ ప్రభుత్వం రేవంత్‌కు ఆదేశాలిచ్చింది. అందుకే రేవంత్ కాళేశ్వరం ప్రాజెక్టుపై పగ పట్టారు. మోదీకి, రేవంత్‌కి అనేక పోలికలు ఉన్నాయి. కాంగ్రెస్ పాలన వల్లే తెలంగాణలో యూరియా సంక్షోభం వచ్చింది. ఒకవైపు యూరియా సంక్షోభం ఉంటే, రేవంత్ రెడ్డి సినిమా వాళ్లతో మీటింగ్ పెట్టు-కున్నారు. రేవంత్‌పై మాట పడకుండా బీజేపీ కాపాడుతోందని మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

## ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ మోసం

(మొదటి తరువాయి)

విధిస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నదని చెప్పారు ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఇనుప కంచెలు, బ్యారికెడ్లతో ప్రజా తిరుగుబాటును ఆపలేరు. పోలీసు బలం, బలగంతో విద్యార్థుల నిరసన జ్వాలలను చల్లార్చలేరు.ఉస్మానియా విద్యార్థి, నిరుద్యోగులు సింహాలై గర్జిస్తరు. ఉద్యోగాల పేరిట మీరు చేసిన మోసాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తరు. మోసం చేసినందుకు ఉస్మానియా సాక్షిగా విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్‌ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా రేవంత్ రెడ్డి చేసిందేముందన్నారు. జాబ్‌క్యాలెండర్‌ను జాబ్ లెస్ క్యాలెండర్ చేశారని మండిపడ్డారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ-కి వస్తున్న సందర్భంగా విద్యార్థులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామిక, పిరికిపంద చర్య అన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక్క విద్యార్థి మీద పోలీసు లాఠీ పడినా తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తున్నాం. ఇందుకేనా విద్యాశాఖను, హోం శాఖను మీ వద్ద పెట్టు-కున్నది. ఒక్క విద్యార్థులే కాదు, యావత్ తెలంగాణ మీరు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి నిలదీస్తున్నది. మొత్తం తెలంగాణ సమాజం మీద నిషేధాజ్ఞలు విధిస్తారా... ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్య పాలన అని చెప్పి, ఎమర్జెన్సీ రోజులను తిరిగి తెచ్చిండు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. కేసిఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇవ్వడం. కేసీఆర్ హయాంలో ఓయూలో శంకుస్థాపన చేసిన నిర్మాణాలను ప్రారంభించడం తప్ప 22 నెలలుగా నువ్వు చేసింది ఏముంది రేవంత్ రెడ్డి?. జాబ్ క్యాలెండర్ జాబ్ లెస్ క్యాలెండర్ చేసారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేసారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేసారు. 22నెలల్లో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు- తప్పుడు ప్రచారం చేస్తున్నావు. నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నవని మండిపడ్డారు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవు. గ్రంథాలయాల్లో పోలీసు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది.

## సంపాదకీయం

# మాటలే తప్ప




"చట్టసభల్లో వాదోపవాదాలుండాలి, అవి లేకపోతే సభలు జీవంలేని రాతి భవనాలుగా మిగిలిపోతాయి" అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభిప్రాయపడ్డారు. ఆదివారం అఖిల భారత స్పీకర్ల సమావేశంలో షా ఈ వ్యాఖ్యలు చేశారు. సార్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కానీ, పార్లమెంటులో వీరు అనుసరిస్తోందేమిటి? మంద బలంతో ప్రతిపక్షాల గొంతునొక్కుతున్న వారే ఇప్పుడు చట్టసభల్లో వాదోపవాదాలుండాలని సెలవిస్తున్నారు! అంతే కాదు "చట్టసభలు రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ నిష్పక్షపాత వేదిక కావాలి" అని కూడా షా ఆకాంక్షించారు. మరి ఈ నిష్పాక్షికత ఎందుకు కొరవడుతోంది? ప్రజాసమస్యలు చర్చించ కుండా సభలను వాయిదాలు వేస్తుందెవరు? కేంద్రంలో వీరు అధికారంలోకి వచ్చింది మొదలు ప్రజల హక్కుల హననం అప్రతి హతంగా కొనసాగుతూనే ఉంది కదా. వాటి మాటేంటి? ప్రజాస్వామ్యానికి ఊపిరి చట్టసభలు. వాటిలో చర్చలు జరిగితేనే నిజానిజాలేమిటో ప్రజలకు తెలుస్తాయి. ప్రభుత్వం తీసుకోస్తున్న చట్టాల లోటుపాట్లేమిటో ఇక్కడ చర్చలు జరిగితేనే తెలుస్తాయి. కానీ విపక్ష పార్టీలు చర్చలకు పట్టుపడ్డం పాలకపక్షం దానికి ససేమిరా అనడం పరిపాటిగా మారి పోయింది. ఏవరికైనా పట్టువిడుపులుండాలి. కానీ, విపక్షాలు ఇచ్చిన అన్ని వాయిదా తీర్మానాలను బుట్టదాఖలు చేస్తూ చర్చకు ఆస్కారమివ్వనిది సర్కారు వారే కాదా! పైగా "విపక్షాలు దారి తప్పాయని పార్లమెంట్‌ను జరగనీయకుండా అడ్డం పడుతున్నాయి" అని వారిమీదకే నెపం నెట్టి చేతులు దులుపుకుంటున్నారు? ఫలితంగా ప్రజా సమస్యలపై చట్టసభలో చర్చలు జరగడం లేదు. కానీ వీధి పోరాటాలు మాత్రం జరుగుతున్నాయి. దీనివల్ల ప్రజలకు.. దేశానికి ఎలాంటి మేలు జరుగు తుంది? దానికి పాలకపక్షంగా మీ బాధ్యతెంత? పార్లమెంట్‌లో ఎంపీలు లిఖిత పూర్వకంగా అడిగే ప్రశ్నలకు, మంత్రులు ఇచ్చే జవాబుల్లో పస కనబడడంలేదు. అంతా యాంత్రికంగా, మొక్కుబడిగా జరుగుతు న్నట్టు కనపడు తోంది. నిజానికి గత కొద్ది సంవత్సరాలుగా పార్లమెంట్‌లో అద్భుతమైన ప్రసంగాలు కానీ, చర్చలు కానీ జరిగిన దాఖలాలు లేనేలేవు. ఒకప్పుడు హేమాహేమీలైన నేతలు మాట్లాడుతుంటే మీడియా, అతిథుల గ్యాలరీలు కిక్కిరిసిపోయి కనిపించేవి. ఇప్పుడు పార్లమెంట్ గ్యాలరీలు మీడియా ప్రతినిధులు కూడా లేక వెలవెలబో తున్నాయి. అందుకే చట్టసభలు ఒక ప్రహసనంలా మారిపోయాయి.

విపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాల పాలనను గవర్నర్ల ద్వారా స్తంభింజేయడం మొదలు పహల్గాం ఉగ్రదాడి, బీహర్ 'సర్', కర్నాటక ధర్మస్థల వ్యవహారం, ఇప్పటికీ రావణకాష్టంలా రగులుతున్న మణిపూర్ గురించి కానీ, ఆర్టికల్ 370 రద్దు విషయం కానీ, రైతు, కార్మిక వ్యతరేక చట్టాలు కానీ.. ఇలా ఒకటేమిటి? ఇప్పటి "పదవీచ్యుతి" బిల్లు సహా ఏ అంశాలను చర్చకు పెట్టారు? ఎన్ని సార్లు విపక్షాల ప్రశ్నలకు బాధ్యతగా సమాధానమిచ్చారు? ఇలా చెబుతూపోతే కొండవీటి చేంతాడంత జాబితా అవుతుంది.

పహల్గాం ఉగ్రదాడి, తదనంతర ఆపరేషన్ సిందూర్‌తోపాటు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌ను, ఉగ్రవాదాన్ని ఒంటరిపాటు చేయడానికి వివిధ పార్టీల నేతలను దేశదేశాల్లో తిప్పిన సర్కారు ఈ దేశ ప్రజలకు వివరించడానికి మాత్రం పార్లమెంటును సమావేశ పర్చలేకపోయింది? ఇదేనా పారదర్శకత! ఇదేనా 'నిష్పాక్షికత'? వాస్తవానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఏ అంశంపైన అయినా సరే చర్చకు ప్రభుత్వం భయపడ కూడదు. బాధ్యతగా చర్చకు అవకాశమివ్వాలి. ప్రశ్నలకు సమాధానమివ్వాలి. విమర్శలను స్వీకరించాలి. సభ ఆమోదం పొందాలి. కానీ, ఈ ప్రభుత్వం భయపడుతోంది. అధిక సంఖ్యాక సభ్యులు తన పక్షాన ఉండి కూడా ఆందోళన చెందుతోంది? చర్చలను అనుమతించేందుకు నిరాకరిస్తోంది. ఎందుకు? అనుమతిస్తే ప్రజలకు సత్యాలు వెల్లడవుతాయని సర్కార్ జంకుతోందా? చర్చలకు అవకాశం లేని పార్లమెంటు శకంలోకి భారత్ ప్రవేశించిందా? అన్న అనుమానం కలుగుతోంది. ఇదే నిజమైతే ప్రజాసమస్యల పరిష్కారానికి అవసరమైన చట్టాలు, నిర్ణయాలు చేయాల్సిన చట్టసభలు నిర్జీవ రాతిభవనాలుగానే మిగిలిపోతాయి.


# అనుమతుల్లేని కేబుళ్లను తొలగించండి

### ప్రభుత్వానికి హైకోర్టు మరోసారి ఆదేశం



ప్రజా స్వేచ్ఛ –హైదరాబాద్

విద్యుత్ స్తంభాలకు అనుమతి లేకుండా ఉన్న కేబుళ్లను వెంటనే తొలగించాలని ప్రభుత్వానికి హైకోర్టు సోమవారం ఆదేశించింది. అనుమతులున్న వాటిని గుర్తించి, అవి ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటే చట్ట ప్రకారం నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలంది. వాటిపై చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. అంతేగాకుండా అనుమతులున్న కేబుల్ ఏజెన్సీలు అనధికారిక కేబుళ్లను తొలగించడానికి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమ కేబుళ్లను తొలగించడానికి, ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, టీజీఎస్పీడీసీఎల్‌లకు గత విచారణలో ఆదేశించిన మేరకు సోమవారం అఫిడవిట్లను దాఖలు చేశాయి. విద్యుత్ స్తంభాలకు చాలా చాలా కేబుళ్లు ఉంటున్నాయనీ, వాటిలో ఏవి చట్ట ప్రకారం ఉన్నాయో ఏవి చట్ట వ్యతిరేకంగా ఏర్పాటు చేసినవో గుర్తించేందుకు కష్టం అవుతుందని తెలిపాయి. వీటిపై చర్యలు తీసుకోడానికి చాలా సమయం పడుతుందని చెప్పాయి. ఈ వివరాలను జస్టిస్ నగేశ్ భీమపాక రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. దీనిపై తగిన ప్రతిపాదనలతో రావాలని ఆదేశించారు. తదుపరి విచారణను వాయిదా వేశారు. హైదరాబాద్ సిటీలోని రామంతాపూర్‌లో విద్యుద్ఘాతంతో ఆరుగురు మరణించిన ఘటన తరువాత ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు కేబుళ్లను కట్ చేయడాన్ని సవాలు చేస్తూ భారతి ఎయిర్‌టెల్ హైకోర్టును




తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ఆశ్రయించింది. అన్ని అనుమతులు తీసుకున్నాకే కరెంటు స్తంభాల ద్వారా కేబుళ్లు తీసుకున్నామని తెలిపింది. ఎలాంటి నోటీసు జారీ చేయకుండా నగరమంతా కేబుళ్లను కట్ చేయడం చెల్లదని తెలిపింది. ఈ వ్యవహారంపై గత విచారణలోనే హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కరెంటు వైర్లు తగిలి ఆరుగురు మరణించారనీ, ఆ మృతులకు ఎవరు బ్యాధ్యత వహిస్తారని ప్రశ్నించింది. తండ్రి చనిపోతే పుట్టినరోజు నాడే తొమ్మిదేళ్ల బాలుడు పాడె మోయాల్సిన, చితికి నిప్పు పెట్టాల్సిన దుస్థితికి ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీసింది. పిటిషన్‌లో ప్రతివాదిగా ఉన్న. టీజీఎస్పీడీసీఎల్ స్పందిస్తూ, రాష్ట్రంలో సుమారు 20 లక్షలకు పైగా స్తంబాలుంటే 1.73 లక్షల స్తంభాలకు మాత్రమే కేబుళ్ల లాగేందుకు అనుమతులున్నాయని తెలిపింది. అయితే ప్రతి స్తంభానికీ విచ్చలవిడిగా కేబుళ్లున్నాయని చెప్పింది. పరిమితికి మించి కేబుళ్లుండటంతో స్తంభాలు భారం భరించలేక వైర్లు నేలకు తగిలే ప్రమాదకర పరిస్థితులున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై హైకోర్టు, కేబుళ్ల బరువుకు స్తంబాలు వాలిపోతుంటే కింది సిబ్బంది జేబులు సొమ్ముతో నిండుతున్నాయని వ్యాఖ్య చేసింది. అక్రమంగా కేబుళ్లు ఉన్నాయని గుర్తించినపుడు వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీసింది. ఇలాంటి విషయాలపై కఠినంగాఉండాలని తేల్చి చెప్పింది. ఆరు కుటుంబాలకు చెందిన వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేసింది ఆ కుటుంబాల వేదనను అర్థం చేసుకోవాలంది. ఈ నిర్లక్ష్యానికి సమష్టి బాధ్యత తీసుకోవాల్సిందేనని పేర్కొంది. అనుమతులేని కేబుళ్లతోపాటు అనుమతులుండీ వేలాడుతూ మనిషికి తగిలేలా ఉన్న కేబుళ్లను తొలగించాల్సిందేనని ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది.

# నిరుద్యోగుకు గుడ్‌న్యూస్..

# 1623 సర్కార్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల!



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



ప్రజా స్వేచ్ఛ –హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో 1623 వైద్యుల పోస్టుల భర్తీకి వైద్య ఆరోగ్య శాఖ వివరణాత్మక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ శాఖ పరిధిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) ఆసుపత్రుల్లో 1616 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటితోపాటు ఆర్టీసీ ఆసుపత్రుల్లో మరో 7 పోస్టులను భర్తీ చేయనుంది. ఈ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ సెప్టెంబరు 8 నుంచి ప్రారంభంకానుంది. ఆగస్ట్ 22 దీ వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. అభ్యర్థులు ఒకటి కన్నా ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే ఒక్కో పోస్టుకు విడివిడిగా దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. ఈ పోస్టులను జోన్‌ల వారీగా భర్తీ చేస్తారు. మల్టీజోన్ 1లో 858, మల్టీజోన్ 2లో 765 పోస్టులను నియమించనున్నారు. ఈ పోస్టులకు ఎంపికైన డాక్టర్లు ప్రైవేటు ప్రాక్టీస్ పెట్టుకోవడానికి అనర్హులని నోటిఫికేషన్‌లో వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.

**విభాగాల వారీగా పోస్టుల వివరాలు..**

గైనకాలజీ పోస్టుల సంఖ్య: 247
ఎనస్తీషియా పోస్టుల సంఖ్య: 226
పీడియాట్రిక్ పోస్టుల సంఖ్య: 219
జనరల్ సర్జన్ పోస్టుల సంఖ్య: 174
జనరల్ మెడిసిన్ పోస్టుల సంఖ్య: 166
పాథాలజీ పోస్టుల సంఖ్య: 94
ఆర్థోపెడిక్ పోస్టుల సంఖ్య: 89
రేడియాలజీ పోస్టుల సంఖ్య: 71
ఫోరెన్సిక్ మెడిసిన్ పోస్టుల సంఖ్య: 62
పల్మనరీ మెడిసిన్ పోస్టుల సంఖ్య: 58
సైకియాట్రి పోస్టుల సంఖ్య: 47
ఆప్తమాలజీ పోస్టుల సంఖ్య: 38
డెర్మటాలజీ పోస్టుల సంఖ్య: 31
హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ 24
బయోకెమిస్ట్రీ పోస్టుల సంఖ్య: 8
మైక్రోబయాలజీ పోస్టుల సంఖ్య: 8

ఇప్పటికే పలు ఆస్పత్రుల్లో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న వారికి 20 పాయింట్లు అదనంగా కలపనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డులో పొందుపరిచిన అధికారిక నోటిఫికేషన్‌లో చెక్ చేసుకోవచ్చు.

# ఈడీ దాడి.. గోడ దూకి పరారీ యత్నం!

### స్కూల్ నియామకాల అవకతవకల కేసులో టీఎంసీ ఎమ్మెల్యే అరెస్ట్

**కోల్‌కతా ప్రజా స్వేచ్ఛ**



పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో సోమవారం ఈడీ సోదాలు నిర్వహించినప్పుడు తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జిబన్ కృష్ణ సాహా తన ఇంటి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించి పట్టుబడినట్టు తెలిసింది. అధికారుల కథనం ప్రకారం.. రాష్ట్రంలో స్కూల్ నియామకాల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలకు సంబంధించి బుర్వాన్‌లోని సాహా ఇంట్లో, రఘునాథ్‌గంజ్‌లోని అతడి అత్తమామల ఆస్తుల్లో ఈడీ సోదాలు నిర్వహిస్తున్నది. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే ఇంటి సరిహద్దు గోడ దూకి పారిపోయేందుకు ప్రయత్నించాడని.. అయితే ఈడీ అధికారులు, కేంద్ర బలగాలు దగ్గర్లోని పొలంలో ఆయనను పట్టుకున్నట్టు తెలిసింది. బలమైన ఆధారాలను నాశనం చేసేందుకు ఎమ్మెల్యే తన మొబైల్ ఫోన్‌ను తన ఇంట్లోని ఒక కొలనులోకి విసిరేసినట్టు పీటీఐ పేర్కొంది. అయితే అతడి రెండు ఫోన్లను రికవరీ చేసి ఫోరెన్సిక్ విశ్లేషణ కోసం పంపారు. ఇదే స్కామ్‌లో ఆగస్ట్ 2023లో ఎమ్మెల్యే జిబన్ కృష్ణ సాహా అరెస్ట్ అయ్యారు. మే 2025లో ఆయనకు బెయిల్ వచ్చింది.

# డ్యామ్ పొంగి 2 కి.మీ మేర భారీ గుంత..

### రాజస్థాన్‌లో ఘటన



**జైపూర్ ప్రజా స్వేచ్ఛ**

రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపూర్ జిల్లాలో భారీ వరదలు విధ్వంసం సృష్టించాయి. ఎడతెరిపి లేని వర్షాల వల్ల సుర్వాల్ డ్యామ్ ఉప్పొంగి ప్రవహించింది. దీనివల్ల ఆదివారం సుర్వాల్ గ్రామంలో దగ్గర్లో రెండు కిలోమీటర్ల మేర భారీ గుంత ఏర్పడి జలపాతం లాగా నీరు ప్రవహిస్తున్నది. వరదల వల్ల రహదారులన్నీ జలమయం అయ్యాయి. సర్వాల్, ధనోలి, గొగర్, తదితర గ్రామాల్లోని ఇండ్లన్నీ నీట మునిగాయి. ప్రజలు మరో దారి లేక ఇండ్ల పై కప్పులపైకి చేరారు. ఆహారం, తాగునీరు లభించక ఇబ్బందులు పడ్డారు.


# ఢిల్లీ చేరుకున్న సీఎం రేవంత్, మంత్రులు

**బీసీ బిల్లుపై న్యాయ కోవిదులతో చర్చ**
**రాహుల్ ర్యాలీలో పాల్గొనేందుకు నేడు బీహార్‌కు**



**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి,డిప్యూటి సిఎం మల్లు భట్టి క్రమార్క, పలువురు మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి, పొంగులేటి తదితరులు ఢిల్లీ చేరుకున్నారు. బిసి బిల్లుపై న్యాయ కోవిదులతో చర్చించనున్నారు. అలాగే సీనియర్ లాయర్, ఎంపి అభిషేక్ సింఘ్వీ, జస్టిస్ సుదర్శన్ రెడ్డిలతో చర్చిస్తారు. అలాగే మంగళవారం బీహార్‌లో రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న ర్యాలీలో సిఎం తదితర మంత్రులు పాల్గొంటారు. ఇకపోతే వెనుకబడిన వర్గాల వారికి 42 శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసులో ఇంప్లీడ్ కానుందని సమాచారం. రాష్ట్రపతి గవర్నర్ కు పంపిన బిల్లుల ఆమోదంపై రాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఆరు నెలల క్రితం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసింది. దానిని గవర్నర్ కు పంపగా.. ఆయన కేంద్ర హోంశాఖ ద్వారా రాష్ట్రపతికి పంపారు. తమిళనాడు, కేరళ కేసుల్లో తెలంగాణ కూడా ఇంప్లీడ్ కావాలని బా విస్తోంది. ఈ మేరకు సుప్రీంకోర్టుద్వారా కేంద్రపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించనుంది. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. న్యాయ నిపుణులతో చర్చించనున్నట్టు- తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్ల కోసం ఎంపిక చేసిన మంత్రి వర్గ ఉపసంఘం సభ్యులు మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

కుమార్ రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఢిల్లీ వెళ్లారు. ఉదయం సీఎం రేవంత్ రెడ్డి ఈ మంత్రులకు పర్సనల్ గా కాల్ చేసి ఢిల్లీకి రావాలని కోరారు. దీంతో వరంగల్ పర్యటనలో ఉన్న సీతక్క, కరీంనగర్ పాదయాత్రలో ఉన్న పొన్నం ప్రభాకర్ సహా మిగిలిన మంత్రులు హుటాహుటిన ఢిల్లీ బయల్దే రివెళ్లారు. అక్కడ న్యాయ కోవిదులతో చర్చించి సుప్రీంకోర్టు లో పెండింగ్ లో ఉన్న కేరళ, తమిళనాడు కేసులో ఇంప్లీడ్ కానున్నారు. సెప్టెంబర్ 30 లోగా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు గడువు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు- పూర్తి చేసింది. 2023 డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్ గాంధీ సూచన మేరకు కులగణన నిర్వహించి బీసీల లెక్క తేల్చింది. ఈ మేరకు 42శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. దీనిని ఎలాగైనా అమల చేయాలని చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్న ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాయడంతోపాటు- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా సైతం నిర్వహించింది. పార్లమెంటు-లో నిరసన వ్యక్తం చేసింది. రాష్ట్రపతిని కలిసి నేరుగా విజ్ఞప్తి చేసేందుకు ప్రయత్నించగా అపాయింట్ మెంట్ దొరకలేదు. వీలైనంత త్వరగా బీసీ రిజర్వేషన్లను కొలిక్కి తేవాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.

# మట్టి గణపతి ప్రతిమలను పంపిణి చేసిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**ప్రజా స్వేచ్ఛ**
**25 శేరిలింగంపల్లి ప్రతినిధి**

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద వినాయక చవితి పండుగను పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీ రవి కుమార్ యాదవ్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2000 మట్టి గణపతి ప్రతిమల పంపిణి కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రతిమలను పంపిణీ చేసిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి గారు.ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం మానవ ధర్మం, పర్యావరణ పరిరక్షణకు గాను ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని అని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారు చేసిన వినాయక ప్రతిమలను



వాడవద్దని సూచించారు.రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని అన్ని పేర్కొన్నారు.మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించుకుంటే కులవృత్తిపై ఆధారపడిన కుమ్మరులకు ఉపాధి లభిస్తుందన్నారు. మట్టితో తయారు చేసిన వినాయకులతో పర్యావరణానికి ఎంతో మేలని, ప్రజలందరూ పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా కెమికల్స్ లేని మట్టి వినాయకులను ప్రతిష్ఠించి, పూజించాలని సూచించారు. అందరి భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. కాలుష్యాన్ని నిర్మూలించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చు అన్నారు. ప్రకృతి వనరులను భావితరాల కోసం పరిరక్షించాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. భగవంతుడు సృష్టించిన సృష్టి ని మనం కలుషితం చేయకుండా మట్టి విగ్రహాల ప్రతిష్ట చేపట్టాలని యువతను, భక్తులను కోరారు. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గ ప్రజలు ఉత్సవాలు ప్రశాంతంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ శ్రీ గంగాధర్ రెడ్డి గారు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు.

# రుద్రారం శ్రీ గణేష్ దేవాలయానికి పాదయాత్ర కాట దంపతులు





**ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ వారి నివాసం నుండి రుద్రారం లోని శ్రీ గణేష్ (గణేష్ గడ్డ ) దేవాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ రుద్రారం గ్రామంలోని రామాలయం వద్ద పాదయాత్రలో చేరి, కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి రుద్రారం శ్రీ గణేష్ దేవాలయం వరకు పాదయాత్రగా వెళ్ళారు. ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించి తీర్ధ ప్రసాదాలను అందజేసి వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# నేడు బోనాల పండుగ సందర్బంగా, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు

**-ఆర్.శ్రీనివాస్ రెడ్డి గ్రామ(మాజీ)ప్రస్తుత సర్పంచ్ వెల్టూరు**



**పెద్దమందడి.**
**ప్రజా స్వేచ్ఛ**

పెద్దమందడి మండలం, వెలటూర్ గ్రామంలో, నేడు గ్రామ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ జరుపుకుంటున్న ఈ శుభ సందర్భంగా గ్రామస్తులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని గ్రామ (మాజీ) ప్రస్తుత సర్పంచ్ ఆర్.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీశ్రీశ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయం లో గ్రామ పూర్వికులు ప్రతి సంవత్సరం ముక్కార్తి అర్ధవాదం వాదం నాడు, ఇంట్లో ముందుగానే అమ్మవారి బోనం కోసం సాహిత్యం అందిస్తూ, ప్రతి ఇంటి ఆనవాయితీగా అమ్మవారి సన్నిధిలో కోరికలు తీర్చుకొనుట కోసం వారికి తోచిన విధంగా పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. అదేవిధంగా ఈ సంవత్సరం చెరువులు నిండి వ్యవసాయానికి అనుకూలంగా, గ్రామంలో ప్రజలు ఆరోగ్యంగా, ఐశ్వర్యంగా ఉండాలని, అమ్మవారి దీవెనలు అందరికీ అందాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామానికి విచ్చేస్తున్న, ఆడపడుచులకు, సాధారణంగా ఆహ్వానిస్తున్నామని, గ్రామస్తులందరి పైన అమ్మవారి ఆశీస్సులు మీకు ఎల్లప్పుడూ ఉండాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నానని సంతోషం వ్యక్తం చేశారు. ఈ పండుగ మీ జీవితంలో ఆనంద శ్రేయస్సు మరియు శాంతిని తీసుకురావాలని ఆశిస్తున్నాను అని వెల్టూరు గ్రామ ప్రస్తుత (మాజీ) సర్పంచ్ ఆర్.శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ని కలిసిన ఎంపీ చామల



**ప్రజా స్వేచ్ఛ రామన్నపేట ప్రతినిధి**

ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్ల నిలుపుదల గురించి సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ ని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కలిసారు.ఘట్కేసర్ నుండి యాదాద్రి భువనగిరి ఎంఎంటీఎస్ రైలు భూ సేకరణ కోసం యాదాద్రి కలెక్టర్ మరియు మేడ్చల్ కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడారు.భువనగిరి నుండి యాదాద్రి(రాయిగిరి) పనులు మొదలయ్యాయి వీటిని త్వరితగతిన పనులు పూర్తి చేసి యాదాద్రికీ వచ్చే భక్తులకు అప్ అండ్ డౌన్ కార్మికుల కష్టాలు తీరుతాయన్నారు.రామన్నపేటలో ఫలక్ నుమ,శబరి,నారాయణాద్రి ఎక్స్ప్రెస్ లో హాల్టింగ్ గురించి చర్చించారు దీనికి రైల్వే మేనేజర్ సనుకూలంగా స్పందించండి జరిగిందని తెలిపారు వీరితోపాటు సౌత్ సెంట్రల్ రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయనాథ్ కోట్ల,ఎంఎంటిఎస్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

**-డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పాశం స్వామి**



**ప్రజా స్వేచ్ఛ**
**వలిగొండ**

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించినట్టు కనీస గౌరవ వేతనం 5 వేలు ఇవ్వాలని. కమిషన్ పెంచాలని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పాశం స్వామి ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యలో స్థానిక ఎమ్మార్వో దశరథ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లందరికీ గౌరవ వేతనం 5 వేలు పెంచాలని.ఏ నెల కమిషన్ ఆ నెలలోనే చెల్లించాలని. ఐదు నెలల బియ్యం కమిషన్ డబ్బులు వెంటనే చెల్లించాలని హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో డీలర్లకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలని వినత పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షులు నూనె రఘు. నరసింహాచారి వెంకటేశం స్వామి ఐలయ్య డీలర్లు తధితరులు పాల్గొన్నారు.

# అండర్ 17 జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులు



జిల్లా స్థాయికి క్రీడలకు ఎంపికైన వివేకానంద విద్యార్థులు

**ప్రజా స్వేచ్ఛ రామన్నపేట ప్రతినిధి**

మండల కేంద్రంలో ఎస్ జి ఎఫ్ నిర్వహించిన అండర్ 17 మండల స్థాయి క్రీడా పోటీల్లో వివేకానంద పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.జిల్లా స్థాయి వాలీబాల్ టీంకు ఈశ్వర్ ఎంపిక,కబడ్డీ విభాగంలో మహేశ్వరం భరత్,నోముల విశ్వజ్ఞాన్,దూలం వినీత్ కబడ్డీ టీంకు,గుడిసె చరణ్ తేజ్ ఖో ఖో విభాగంలో జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ తిరుగుడు మల్లికార్జున్ అభినందించారు.

## స్ఫూర్తివంతం సురవరం జీవితం

**-పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షుడు**




**ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి**

స్ఫూర్తివంతమైన జీవితాన్ని గడిపిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.సురవరం 73వ వర్ధంతి పురస్కరించుకొని కళా వేదిక పక్షాన సోమవారం ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో తెలుగు భాషా అభ్యున్నతి కోసం గోల్కొండ పత్రిక ద్వారా విశేషమైన కృషిని సాగించారని గుర్తు చేశారు.తెలుగు ప్రజలఆత్మగౌరవంగా, ప్రజాప్రతినిధిగా, సంఘసంస్కర్తగా,విద్యావేత్తగా,న్యాయవాదిగా,సాహితీవేత్తగా పరిశోధకుడిగా ఆయన చేసిన సేవ ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని తెలిపారు.తెలంగాణ వైతాళికుడిగా సురవరం ప్రతాపరెడ్డి అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని వివరించారు.ఈనాటి కార్యక్రమంలోఎంఇఓ. మద్దిలేటి, జిహెచ్ఎం.శ్రీనివాస్ రెడ్డి,శ్రీనివాసరావు,సాహితీవేత్తలు బైరోజు చంద్రశేఖర్,శాంతన్న, డా.శ్యాంసుందర్,గంధం నాగరాజు,రాజారెడ్డి, భానుచందర్,మెకానిక్ శ్రీనివాసులు,జయంత్ రెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛ రహిత,చైతన్య రహితంగా ఉన్న సమాజాన్ని మేల్కొల్పిన గొప్ప సంఘసంస్కర్త సురవరం ప్రతాపరెడ్డి

**ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి**



**ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి**

సురవరం ప్రతాపరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,నిజాం నిరంకుశ పాలనలో తెలంగాణ ప్రజలు. ఎదుర్కొంటున్న అణిచివేతలను ఎదిరించిన సాహసి.రాజకీయ సాంఘిక సాంస్కృతిక పరంగా స్వేచ్ఛారహిత,చైతన్య రహితంగా ఉన్న సమాజాన్ని మేల్కొల్పిన గొప్ప సంఘసంస్కర్త సురవరం ప్రతాప రెడ్డి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.సంఘ సంస్కర్తగా,కవిగా, చిత్రకారుడుగా, రచయితగా, వ్యాసకర్తగాపత్రికా సంపాదకుడిగా, పరిశోధకుడిగా,ఇలా తాను చేపట్టిన ప్రతి రంగంలోనూ తెలంగాణ ప్రజల బాధలను కళ్ళకు కట్టినట్లు వివరిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ నిజాం పాలకుల దాష్టికాలపై ముప్పట దాడి చేసిన గొప్ప ప్రజ్ఞశీలి సురవరం ప్రతాపరెడ్డి ని ఎమ్మెల్యే పేర్కొన్నారు.354 కవులతో కూడిన “గోల్కొండ కవుల సంచిక” గ్రంథాన్ని కవుల జీవిత విశేషాలతో సహా ప్రచురించి గ్రంథరూపంలోనే సమాధానమిచ్చిన వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి. 1896 మే 28న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా గద్వాల సంస్థానంలోని ఇటిక్యాల పాడులో నారాయణరెడ్డి రంగమ్మ దంపతులకు సురవరం జన్మించారని ఆయన తెలిపారు.పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి నామకరణం చేయడం ఎంతో గొప్ప విషయమని హర్షం వ్యక్తం చేశారు.

## ప్రకృతి హితమే పండగల పరమార్థం

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**-మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్**



**ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి**

రామచంద్రాపురం హిందూ సంప్రదాయంలో ప్రతి పండుగ వెనుక ఒక పరమార్థం దాగి ఉందని, వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణసహిత మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి కోరారు వినాయక చవితిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆరవ వార్డు సాయిబాబా నగర్ కాలనీలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రజలకు ప్రతిమలను పంపిణీ చేశారు

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల అంశంపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రసాయనలతో కూడిన ప్రతిమలను చెరువులలో నిమజ్జనం చేయడం మూలంగా జంతుజాలం చనిపోవడంతో పాటు, నీటి కాలుష్యం ఏర్పడుతుందన్నారు. జిహెచ్ఎంసి, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రజలందరికీ ఉచితంగా మట్టి వినాయకులు పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


# ఓయూకు మళ్లీ వస్తా..
# ఒక్క పోలీస్ ఉండొద్దు..





**ప్రజా స్వేచ్ఛ హైదరాబాద్**

ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) తెలంగాణకు ప్రత్యామ్నాయ పదమని.. 4 కోట్ల తెలంగాణ వాసుల గళం ఉస్మానియా అని.. సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.. నిజాంకు వ్యతిరేకంగా పీవీ నరసింహారావు.. ఓయూ గడ్డమీద నుంచే ధిక్కారస్వరం వినిపించారన్నారు. పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, జైపాల్ రెడ్డి, జార్జిరెడ్డి, గద్దర్‌లను తెలంగాణకు అందించిన విశ్వవిద్యాలయం ఓయూ అంటూ సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.. తెలంగాణ సమాజానికి సమస్య వచ్చినా సంక్షోభం వచ్చినా చర్చ ఇక్కడే జరుగుతుంది.. తెలంగాణలో సమస్య ఏదైనా ఉద్యమం ఇక్కడే మొదలవుతుందన్నారు. సోమవారం ఉస్మానియా యూనివర్సిటీలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఓయూలో కొత్త హాస్టల్ భవనాలను ప్రారంభించారు. గిరిజన విద్యార్థుల కోసం మరో రెండు హాస్టళ్లకు శంకుస్థాపన చేశారు. సీఎం రీసెర్చ్ ఫెలోషిప్ పథకాన్ని కూడా రేవంత్ రెడ్డి ప్రారంభించారు.. అనంతరం ఠాగూర్



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ఆడిటోరియంలో విద్యార్థులనుద్దేశించి సీఎం ప్రసంగించారు. ఉస్మానియా యూనివర్సిటీ పోరాటం నేర్పిందని.. 4 కోట్ల తెలంగాణ వాసుల గళం ఉస్మానియా అన్నారు. జార్జిరెడ్డి, శ్రీకాంతాచారి, వేణుగోపాలరెడ్డి వంటివారు ఉద్యమంలో అమరులయ్యారంటూ పేర్కొన్నారు. అలాంటి ఓయూను కాలగర్భంలో కలిపేయాలని కుట్ర జరిగిందని.. ఓయూ అభివృద్ధికి మళ్లీ తాను సీఎం అయ్యాక బాటలు వేశానని సీఎం రేవంత్ అన్నారు. 108 ఏళ్ల యూనివర్శిటీకి దళితుడిని వీసీ చేసి చూపించామన్నారు.తాను మళ్లీ డిసెంబర్‌లో ఉస్మానియా యూనివర్సిటీకి వస్తానని.. అప్పుడు ఒక్క పోలీస్‌ను కూడా పెట్టకండి అంటూ సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ దగ్గరే సెక్యూరిటీ లేకుండా మీటింగ్ పెడతా.. అప్పుడు విద్యార్థులు నిరసన తెలిపినా నేను ఏమీ అనను అంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పే చిత్తశుద్ధి ఉందన్నారు. “నేను మళ్లీ ఓయూకు వస్తా.. ఆర్ట్స్ కాలేజ్ ముందు మీటింగ్ పెడతా.. ఆరోజు ఒక్క పోలీస్ కూడా ఉండొద్దు.. ఎవరి అభిప్రాయం వాళ్లు చెప్పొచ్చు.. ఆరోజు ఒక్క పోలీస్ కూడా క్యాంపస్‌లో ఉండరు.. డిసెంబర్‌లో ఆర్ట్స్ కాలేజ్ దగ్గర మీటింగ్ పెట్టండి.. అదేరోజు అక్కడికక్కడే జీవోలు ఇస్తా.. ఓయూకు ఏం కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా” అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# గీతంలో మెగా రక్తదాన శిబిరం

**బ్రహ్మకుమారీస్,భారతీయ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహణ - 160 మంది రక్తదానం**





**ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి**

బ్రహ్మకుమారీల మాజీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ రాజయోగిని దాది ప్రకాశమణిజీ 18వ పుణ్యతిథిని సార్వత్రిక సోదర దినోత్సవం (యూనివర్సల్ బ్రదర్ హుడ్ డే)గా జరుపుకుంటారు. భారతదేశం, నేపాల్ లలో లక్ష యూనిట్ల రక్తాన్ని సేకరించి, గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించాలని బ్రహ్మకుమారీస్ సంకల్పించారు. ఇందులో భాగంగా, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం (25-8-2025న) మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. బ్రహ్మకుమారీలు (చందానగర్ శాఖ),సోషల్ సర్వీస్ వింగ్ (ఆర్ఈఆర్ఎఫ్),భారతీయ రెడ్ క్రాస్ సొసైటీల చేశారు గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ ఈ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, సమాజ హితం కోరుతూ చేసే నిస్వార్థ చర్యగా వారు అభివర్ణించారు.ప్రాణాలను కాపాడడంలో సమాజంలో కరుణ,బాధ్యతాయుత స్ఫూర్తిని పెంపొందించడంలో స్వచ్ఛంద రక్తదానం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే ఈ కార్యక్రమంలో దాదాపు 160 మంది స్వచ్ఛంద సేవకులు (గీతం విద్యార్థులు) రక్తదానం చేయడానికి ముందుకు వచ్చారు రక్తదాతలకు బ్రహ్మకుమారీలు ప్రశంసా పత్రాలను, రిఫ్రెష్ మెంట్లను అందజేశారు. ఈ చురుకుగా పాల్గొని రక్తదానం చేయడానికి విద్యార్థులను ప్రేరేపించారు వైద్య నిపుణుల ప్రకారం, ఒక యూనిట్ రక్తం ముగ్గురి నుంచి నలుగురి ప్రాణాలను కాపాడుతుందని,ఒకటి రెండు రోజులలో శరీరం కొత్త రక్తాన్ని నింపుకుని దాతలను తాజాగా, ఆరోగ్యంగా ఉంచుతుందన్నారు.రక్తదానం ఇనుము స్థాయిలను నియంత్రించడంలో సాయపడుతుందని, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని తెలిపారు. రక్తదానానికి ముందు ఉచిత ఆరోగ్య పరీక్షలు (రక్తపోటు, హిమోగ్లోబిన్ వంటివి) ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడంలో సాయపడతాయన్నారు. అంతేగాక,దాతలు అంతర్గత శాంతి,సంతృప్తి, ఆనందాన్ని అనుభవిస్తారని నిపుణులు పేర్కొన్నారు.

## హల్ది వాగు వంతెన పనులు వేగవంతం చేయాలి

**--కలెక్టర్ రాహుల్ రాజ్**

**ప్రజా స్వేచ్ఛ మెదక్ జిల్లా ప్రతినిధి**

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సోమవారం తూప్రాన్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. రత్నాపూర్ గ్రామంలో హల్ది వాగు వంతెన నిర్మాణ పనులను పరిశీలించి, జాప్యానికి గల కారణాలు ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఉపయోగం కలిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.అలాగే, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించి, పేదలకు సొంతింటి కల త్వరగా నెరవేరేలా వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు.గ్రామ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా



ఉండాలని, వ్యక్తిగత శారీరక పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీరు మరియు వేడివేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల లార్వాలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ పర్యటనలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


# బిజినెస్

## ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్లు.. లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



భారత స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించనుందనే అంచనాలున్నాయి. ఐటీ స్టాక్స్‌లో భారీ కొనుగోళ్లు జరిగాయి. దాంతో మార్కెట్లు వారంలో తొలిరోజు లాభపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,501.06 వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,364.86 పాయింట్ల కనిష్టాన్ని చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 81,799.06 పాయింట్ల గరిష్టానికి పెరిగింది. చివరకు 329.05 పాయింట్లు పెరిగి.. 81,635.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 97.65 పాయింట్లు పెరిగి 24,967.75 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, సన్ ఫార్మా, మారుతి, టైటాన్ లాభపడ్డాయి.భారత్ ఎలక్ట్రానిక్స్, ఆసియన్ పెయింట్స్, భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. రంగాల వారీగా చూస్తే.. ఐటీ ఇండెక్స్ 2.3శాతం పెరిగింది. రియాలిటీ ఇండెక్స్ 0.7శాతం వృద్ధిని నమోదు చేసింది. మెటల్ ఇండెక్స్ 0.6శాతం పెరిగాయి. ఆసియా మార్కెట్లలో, దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నిక్కీ 225 ఇండెక్స్, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హాంగ్ సెంగ్ సానుకూల లాభాల్లో ముగిశాయి. యూరోపియన్ మార్కెట్లు నష్టాలతో ట్రేడవుతున్నాయి. శుక్రవారం యూఎస్ మార్కెట్లు బాగా పెరిగాయి. సెప్టెంబర్‌లో ఫెడ్ వడ్డీ రేటు తగ్గింపు, యూఎస్‌లో వడ్డీ రేటు తగ్గుతుందనే అంచనాలు దేశీయ మార్కెట్లో ఆశావాదం నెలకొందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ పరిశోధనా అధిపతి వినోద్ నాయర్ పేర్కొన్నారు.

# పసిడి ప్రియులకు బిగ్ రిలీఫ్..



బంగారం ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. ప్రపంచ మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ మధ్య స్టాకిస్టులు అమ్మకాలు జరుపడంతో ధరలు స్వల్పంగా దిగివచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల బంగారంపై రూ.200 తగ్గి తులం ధర రూ.1,00,170కి చేరిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. అలాగే, 22 క్యారెట్ల పసిడి ధర రూ.150 తగ్గి రూ.99,900కి తగ్గింది. అదే సమయంలో వెండి ధరలు కిలోకు రూ.1,15,000 వద్ద స్థిరంగా కొనసాగుతున్నాయి.ప్రపంచ మార్కెట్లలో న్యూయార్క్‌లో బంగారం 0.26 శాతం తగ్గి ఔన్సుకు 3,363.45కి డాలర్లకు చేరింది. వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు పెరగడంతో సానుకూల ధోరణిని కలిగి ఉంటుందని భావిస్తున్నారని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్ అండ్ కరెన్సీ హెడ్ ప్రవీణ్ సింగ్ పేర్కొన్నారు. స్పాట్ సిల్వర్ కూడా 0.17 శాతం తగ్గి ఔన్సుకు 38.78 డాలర్లకు చేరింది. మెహతా ఈక్విటీస్ కమోడిటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలాంత్రి మాట్లాడుతూ.. గత వారం జాక్సన్ హోల్ సింపోజియంలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలతో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. డిసెంబర్ తర్వాత సెంట్రల్ బ్యాంక్ త్వరలో తొలిసారి వడ్డీ రేట్లను తగ్గించవచ్చని పావెల్ పేర్కొన్నారు. రాబోయే యూఎస్ ఫెడరల్ రిజర్వ్ FOMC సమావేశం సెప్టెంబర్ 16-17 తేదీల్లో జరుగనున్నది. అయితే, నిరంతర ద్రవ్యోల్బణ ఆందోళనలు, మందగించిన ఆర్థిక కార్యకలాపాలు దూకుడు వడ్డీ రేటు కోతలకు దారితీయకపోవచ్చని కలాంత్రి పేర్కొన్నారు. దాంతో బంగారం లాభాలను అడ్డుకునే అవకాశం ఉందన్నారు. పెట్టుబడిదారులు రెండవ త్రైమాసికానికి సంబంధించిన ప్రైమరీ యూఎస్ జీడీపీ డేటాను పెట్టుబడిదారులు నిశితంగా పరిశీలిస్తారని ఆగ్‌మాంట్ పరిశోధన విభాగాధిపతి రెనిషా పేర్కొన్నారు. ఈ డేటా గురువారం విడుదల కానున్నది. ఇది ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరి, బులియన్ సెంటిమెంట్ గురించి అంచనాలు తెలిసే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే.. 24 క్యారెట్ల బంగారం రూ.1,01,510 ఉండగా.. 22 క్యారెట్ల పసిడి రూ.93,050గా ఉన్నది. కిలో వెండి రూ.1.31లక్షల ధర పలుకుతున్నది.

# గుడ్‌న్యూస్ చెప్పిన ఫ్లిప్‌కార్ట్..

### పండుగ సీజన్‌లో కొత్తగా 2 లక్షలకుపైగా తాత్కాలిక ఉద్యోగాలు


ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ శుభవార్త చెప్పింది. రానున్న పండుగ సీజన్ ను దృష్టిలో ఉంచుకొని పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు ప్రకటించింది. తన వార్షిక మెగా సేల్ 'ది బిగ్ బిలియన్ డేస్' కోసం దేశవ్యాప్తంగా కొత్తగా 2 లక్షలకు పైగా తాత్కాలిక ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ప్రకటించింది.పండుగల సీజన్ వస్తోంది. ఆగస్టు 27న వినాయక చవితి, సెప్టెంబరు 22 నుంచి నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఆ తర్వాత దసరా, దీపావళి ఇలా వరుస పండుగలు ఉన్నాయి. ఏటా పండుగల సీజన్‌లో ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్ సేల్‌ను ప్రకటిస్తుందన్న విషయం




తెలిసిందే. పండుగ సీజన్‌లో తక్కువ ధరకే పలు వస్తువులను సేల్‌కు పెడుతుంది. దీంతో ఆ సమయంలో పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తుంటాయి. వాటిని కస్టమర్లకు సకాలంలో డెలివరీ చేసేందుకు మానవ వనరులు అవసరం ఏర్పడుతుంది. అందుకోసం ఏటా పండుగల సీజన్‌లో ఉద్యోగాలను భర్తీ చేస్తుంటుంది. ఈ ఏడాది కూడా దేశవ్యాప్తంగా దాదాపు 28 రాష్ట్రాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు సోమవారం ప్రకటించింది. 2.2 లక్షల సీజనల్ ఉద్యోగఅవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా టైర్-2, టైర్-3 నగరాల్లోని యువతకు ఉపాధి కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు పేర్కొంది. కంపెనీ ప్రకారం.. ఈ నియామకాలు ప్రధానంగా సప్లైచైన్, లాజిస్టిక్స్, లాస్ట్-మైల్ డెలివరీ వంటి విభాగాల్లో ఉండనున్నాయి. మొత్తం నియామకాల్లో 15 శాతం మంది మొదటిసారి ఉద్యోగంలో చేరుతున్న వారే. ప్యాకర్స్, పికర్స్, సార్టర్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్‌ల కోసం నియామకాలు జరగనున్నాయి. గతేడాదితో పోలిస్తే మహిళలు, వికలాంగులు (పీడబ్ల్యూడీ), ఎల్జీబీటీక్యూఐఏ వర్గాల వారికి అధికంగా అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ తన ప్రకటనలో వివరించింది.

# హాల్ ఆఫ్ ఫేమ్'లో మాజీ సారథి.. సిడ్నీలో నిలువెత్తు విగ్రహం..!

ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ బెలిండా క్లార్క్ కు అరుదైన గౌరవం లభించింది. ఆ దేశంలో మహిళా క్రికెట్ అభివృద్ధికి, ప్రచారానికి విశేషమైన కృషి చేసిన క్లార్క్‌కు 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు దక్కింది. ఆమెకు లెజెండ్ హోదాను ప్రదానం చేసిన ఆసీస్ బోర్డు.. సిడ్నీ క్రికెట్ మైదానంలో క్లార్క్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఘనత సాధించిన ఆరో ఆసీస్ క్రికెటర్ బెలిండా. ఆమె కంటే ముందు డొనాల్డ్ బ్రాడ్‌మన్, కీత్ మిల్లర్, రిచీ బెనౌడ్, డెన్నిస్ లిల్లీ, షేన్ వార్నర్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో స్థానం సంపాదించారు. అయితే.. తొలి మహిళా క్రికెటర్ మాత్రం బెలిండానే కావడం విశేషం.ఆస్ట్రేలియా హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కడం చాలా గొప్ప గౌరవం. నాకు లెజెండ్ స్టేటస్ రావడాన్ని నమ్మలేకపోతున్నా. దేశానికి సేవ చేసిన దిగ్గజ ఆటగాళ్ల సరసన నా పేరు ఉండడంతో సంతోషం ఉంది. ఒకింత గర్వంగా అనిపిస్తోంది. మరోవైపు కృతజ్ఞతాభావం కూడా మనసులో నిండింది. నేను




సమిష్టితత్వం కలగలసిన ఆటతో పేరు సాధించాను. జట్టులోని సభ్యుల సహకారం, పోరాటపటిమ లేకుండా మనం ఏదీ సాధించలేం. నాకు ఈ ఘనత దక్కడంలో తమ పాత్ర ఉందని కోచ్‌లు, సహాయక సిబ్బంది, క్రికెట్ ఆస్ట్రేలియా అధికారులు సంతోషిస్తారు' అని బెలిండా క్లార్క్ తెలిపింది.సారథిగా ఆసీస్ మహిళా టీమ్‌ను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లింది బెలిండా. ఆమె నేతృత్వంలో 101 వన్డేల్లో ఏకంగా 83 మ్యాచుల్లో గెలిచింది కంగారూ టీమ్. బ్యాటర్‌గా గొప్ప ఇన్నింగ్స్‌లు ఆడిన ఆమె వన్డేల్లో 47.49 సగటు, టెస్టుల్లో 45.95 సగటుతో అత్యధిక సగటుతో రాణించింది. అంతేకాదు డబుల్ సెంచరీ బాదిన తొలి మహిళా క్రికెటర్ కూడా ఆమెనే. 1997 వరల్డ్ కప్‌లో బెర్ముడాపై 229 పరుగులతో అజేయంగా నిలిచింది బెలిండా.బెలిండా మా దేశంలో మహిళా క్రికెట్‌కు ఆమె చుక్కాని. తను అద్భుతమైన బ్యాటర్. అప్పటి వరకూ సంప్రదాయ క్రికెట్ ఆడుతున్న మా జట్టుకు దూకుడు నేర్పింది. బౌలర్లపై విరుచుకుపడడం ఎలానో చూపించింది బెలిండా. ప్లేయర్‌గా, కెప్టెన్‌గా తన ముద్ర వేసింది. ఆమె నాయకత్వ పటిమ.. యువతరంపై ఆమె చూపిన ప్రభావం చిరస్థాయిగా నిలిచిపోతాయి' అని బెలిండాను హాల్ ఆఫ్ ఫేమ్‌కు ఎంపిక చేసిన కమిటీ అధ్యక్షులు బ్రుసే మెక్అవనే వెల్లడించారు.

# టీమిండియా స్పాన్సర్‌షిప్ నుంచి తప్పుకున్న డ్రీమ్11.

### ధ్రువీకరించిన బీసీసీఐ..!

టీమిండియా స్పాన్సర్‌షిప్ నుంచి డ్రీమ్11 తప్పుకుంది. బీసీసీఐతో జరిగిన రూ.358కోట్ల ఒప్పందం నుంచి గడువుకు ముందు అర్థాంతరంగా డ్రీమ్11 రద్దు చేసుకుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు 2025ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఒప్పందం నుంచి వైదొలగాలని ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీ నిర్ణయించుకుంది. బీసీసీఐతో ఒప్పందాన్ని రద్దు చేసుకున్న విషయాన్ని బీసీసీఐ ధ్రువీకరించింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ బిల్ 2025 ఆమోదం నేపథ్యంలో ఒప్పందం ముగిసిందన్నారు. భవిష్యత్‌లో ఆ సంస్థతో బీసీసీఐకి ఒప్పందం ఉండదన్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవల డ్రీమ్ 11 ప్రతినిధులు బీసీసీఐ కార్యాలయానికి చేరుకొని టీమిండియా ప్రధాన స్పాన్సర్‌గా ఇకపై కొనసాగలేమని సీఈవో హేమంగ్ అమీన్ అధికారికంగా బీసీసీఐకి వెల్లడించారు.ఒప్పందం రద్దయిన నేపథ్యంలో రాబోయే ఆసియా కప్‌లో భారత




జట్టు డ్రీమ్ 11 లోగో లేకుండానే మైదానంలోకి దిగబోతున్నది. బీసీసీఐ త్వరలోనే కొత్త స్పాన్సర్ కోసం టెండర్ జారీ చేసే అవకాశం ఉంది. బైజు స్థానంలో 2023లో బీసీసీఐ స్పాన్సర్ హక్కులను డ్రీమ్ 11 సొంతం చేసుకుంది. ఈ స్పాన్సర్ ఒప్పందం విలువను రూ..358 కోట్లుగా నిర్ణయించారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కంపెనీ ఒప్పందం నుంచి వైదొలిగింది. ఈ నిర్ణయం భారతదేశంలో క్రికెట్ నియంత్రణ మండలిపై మాత్రమే కాకుండా క్రీడా ప్రపంచంపై ప్రభావం కనిపించనున్నది. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు స్పాన్సర్‌గా ఉంది. డ్రీమ్ 11కు పలువురు క్రికెటర్లు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్నారు. ఇందులో మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్, జస్‌ప్రీత్ బుమ్రా వంటి అగ్ర క్రికెటర్లు ఈ జాబితాలో ఉన్నారు. 2020లో భారత్-చైనా మధ్య ఉద్రిక్తతల సమయంలో వీవో ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌ను వదులుకున్న సమయంలో డ్రీమ్11 కొంతకాలం టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. తాజాగా డ్రీమ్11 అకస్మాత్తుగా స్పాన్సర్‌షిప్ నుంచి తప్పుకోవడం బీసీసీఐకి ఇబ్బందికరంగా మారింది. కొత్త స్పాన్సర్‌ను వెతికిపట్టుకోవడం సవాల్‌గా మారింది. అయితే, దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా అనేక లీగ్‌లు, ఆటగాళ్లపై కనిపించనున్నది. ఆసియా కప్ ఈ ఏడాది సెప్టెంబర్ రెండోవారం చివరలో మొదలుకానున్నది. దాంతో బీసీసీఐకి స్పాన్సర్స్‌ను తక్కువ సమయంలో వెతకాల్సి ఉంది. ప్రస్తుతానికి ఆటగాళ్ల జెర్సీలపై లోగో కనిపించదు. ఇది బ్రాండ్ విలువ, ఆదాయం రెండింటిని ప్రభావితం చేయనున్నది. 2020లో వివో వైదొలిగిన తర్వాత డ్రీమ్-11 ఐపీఎల్ టైటిల్ స్పాన్సర్‌షిప్‌గా వ్యవహరించిన సమయంలో ఇదే పరిస్థితి నెలకొంది. డ్రీమ్ 11 ఈ కంపెనీ అనేక ఐపీఎల్ ఫ్రాంచైజీలకు, అనేక మంది స్టార్ ఆటగాళ్లకు స్పాన్సర్‌గా ఉంది. కరేబియన్ ప్రీమియర్ లీగ్ భాగస్వామి.

# స్పోర్ట్స్

## వీడ్కోలుపై యూటర్న్.. వరల్డ్ కప్ క్యాంప్‌లో మాజీ కెప్టెన్..!




అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడం.. ఆ తర్వాత కొద్ది రోజులకే యూటర్న్ తీసుకుంటున్నారు కొందరు. దేశం కోసమని.. తొందరపడి రిటైర్మెంట్ ఇచ్చామని కారణాలు చెబుతూ మళ్లీ మైదానంలోకి దిగుతున్నారు. తాజాగా దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ డేన్‌వాన్ నీకెర్క్ సైతం వీడ్కోలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఈమధ్యే దేశవాళీ క్రికెట్‌తో పునరాగమనం చేసిన 32 ఏళ్లున్న నీకెర్క్ వరల్డ్ కప్ సన్నాహక క్యాంప్‌లో చోటు దక్కించుకుందీ ఆల్‌రౌండర్.రెండేళ్ల క్రితం నీకెర్క్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. టీ20 వరల్డ్ కప్ స్క్వాడ్‌లో చోటు లభించలేదనే కోపంతో ఆటకు అల్విదా చెప్పేసిందామె. అయితే.. ఫిట్‌నెస్ నిరూపించుకోలేకనే ఆమె ఎంపికవ్వలేదు. ఈ విషయాన్ని అంగీకరించిన నీకెర్క్ ఇప్పుడు వన్డే వరల్డ్ కప్ సమీపిస్తున్న వేళ యూటర్న్ తీసుకొంది. 'వీడ్కోలు వెనక్కి తీసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. వస్తూ వస్తూనే వరల్డ్ కప్ సన్నద్ధత శిబిరంలో చోటు దక్కించుకోవడం థ్రిల్లింగ్‌గా అనిపిస్తోంది. దేశానికి ప్రాతినిధ్యం వహించడాన్ని ఎంతగా మిస్ అయ్యానో నాకు కాలం గుర్తు చేసింది. అవకాశం రావాలేగానీ మరోసారి దక్షిణాఫ్రికా జెర్సీతో చెలరేగి ఆడేందుకు సిద్ధంగా ఉన్నాను' అని నీకెర్క్ ఇన్‌స్టాగ్రామ్‌లో తెలిపింది.ఇప్పటివరకూ ఈమె సఫారీ టీమ్ తరఫున194 మ్యాచులు ఆడింది. 107 వన్డేలు, 86 టీ20లు, ఒక టెస్టు మ్యాచ్ ఆడిన ఈ ఆల్‌రౌండర్ మూడు ఫార్మట్లలో కలిసి 204 వికెట్లు పడగొట్టింది. నీకెర్క్ సారథ్యంలో 50 వన్డేలు, 30 టీ20లు ఆడిన దక్షిణాఫ్రికా 29 వన్డేల్లో, 15 పొట్టి క్రికెట్ మ్యాచుల్లో గెలుపొందింది. వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని సెలెక్టర్లు ఎంపిక చేసిన 20 మంది బృందంలో నీకెర్క్ ఒకరు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 1వ తేదీవరకూ దర్బన్ వేదికగా జరుగబోయే ఈ సన్నాహక శిబిరంలో ఆమె పాల్గొననుంది. ఈ క్యాంప్ తర్వాత పాకిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది దక్షిణాఫ్రికా. దాంతో, ఫామ్ చాటుకొని.. ఫిటెనెస్ నిరూపించుకొని సెలెక్టర్ల దృష్టిలో పడాలనుకుంటుందీ మాజీ కెప్టెన్. ఒకవేళ పాక్ పర్యటనకు ఎంపికైతే.. వరల్డ్ కప్ స్క్వాడ్‌లోనూ నీకెర్క్ ఉండే అవకాశముంది.

# గ్లామర్‌తో చంపకే పిల్లా..

## జీన్స్‌లో అదిరిపోయే లుక్‌లో అనన్య నాగళ్ల!



తెలుగు బ్యూటీ అనన్య నాగళ్ల పేరు తెలియని వారు ఎవరు ఉండరు. ఈ అమ్మడు మల్లేశం సినిమాతో తెలుగు వెండితెరపైకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ ద్వారా ఈ అమ్మడు తన కంటూ ఓ గుర్తింపు సంపాదించుకుంది. దీంతో ఏకంగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాలోనే ఛాన్స్ కొట్టేసింది.పవన్ కళ్యాణ్ వకీల్ సాబ్ మూవీలో ఈ బ్యూటీ కీలక పాత్రలో నటించింది. ఈ మూవీలో అనన్య నటనకు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీంతో ఈ చిన్నదానికి వరసగా సినిమాలు క్యూ కట్టాయి. దీంతో పలు సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తూ మెప్పిస్తుంది.ఇక ఓ వైపు సినిమాలు మరో వైపు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఈ చిన్నది చాలా బిజీ బిజీగా గడిపేస్తుంటుంది. అంతే కాకుండా ఈ ముద్దుగుమ్మ ఈ మధ్య వరస ఫొటో షూట్‌తో కుర్రకారు మది దోచేస్తుంది. వరసగా ఫొటో షూట్స్ చేస్తూ తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది.తాజాగా ఈ బ్యూటీ తన ఇన్ స్టాలో అదిరిపోయే లుక్‌లో ఉన్న ఫొటోస్ షేర్ చేసింది. జీన్స్‌లో చాలా సింపుల్‌గా కనిపిస్తూ తన గ్లామర్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటుంది.బ్లాక్ టాప్, బ్లూ జీన్స్‌లో అదిరిపోయే స్టిల్స్‌తో, చెట్ల మధ్య కూర్చొని స్టైలిష్ ఫోజులతో కుర్రకారుకు చెమటలు పట్టిస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధిచిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతుండటంతో, గ్లామర్‌తో అలా చంపకే పిల్లా అంటూ కామెంట్స్ చేస్తున్నారు ఈ బ్యూటీ అభిమానులు.



# కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ క్రేజ్ మామూలుగా లేదుగా..!


ప్రస్తుతం కన్నడ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు రుక్మిణి వసంత్.బెంగుళూరులో జన్మించిన ఈ యంగ్ స్టార్ హీరోయిన్ సింపుల్ లుక్తోనే అభిమానుల హృదయాలను దోచుకుంది.యూత్లో క్రేజీ హీరోయిన్గా నిలిచింది. ఈ క్రేజ్కి తగ్గట్టేగానే అవకాశాలు క్యూ కడుతున్నాయి.ప్రస్తుతం, ఆమె చేతిలో మూడు కన్నడ సినిమాలు ఉన్నాయి. ఇందులో కీలక ప్రాజెక్టు కాంతార-ఛాప్టర్ 1 ఒకటి.ఈ సినిమాలో రుక్మిణి 'కనకవతి' పాత్రలో కనిపించనుంది. అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదలవనున్న ఈ చిత్రం మీద భారీ అంచనాలున్నాయి.ఎలాంటి అంచనాలు లేకుండా వచ్చిన కాంతార మూవీ బాక్సాఫీస్ వద్ద భారీగా కలెక్షన్లు రాబట్టింది.రుక్మిణి పోషించిన 'కనకవతి' పాత్ర ఎంతో ప్రభావవంతంగా ఉంటుందని, ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతుందని టాక్.ఈ విజయంతో రుక్మిణి కెరీర్ కొత్త మలుపులు తిరుగబోతోంది. తెలుగు, తమిళ, హిందీ భాషలలో అవకాశాలు దక్కించుకునే అవకాశం ఉందంటున్నారు.ఇక, ఈ నేపథ్యంలో రుక్మిణి.. తమిళ ఇండస్ట్రీలోనూ వరుస అవకాశాలు వస్తున్నాయి.ఆమె నటించిన 'మదరాసి' సినిమా సెప్టెంబర్ 5న విడుదల కానుంది. ఇది రుక్మిణి నటించిన రెండవ తమిళ చిత్రం.ప్రముఖ దర్శకుడు మురుగదాస్ దర్శకత్వంలో, శివకార్తికేయన్ సరసన నటిస్తున్న ఈ చిత్రం మీద భారీ అంచనాలున్నాయి.రుక్మిణి వసంత్ ఈ రెండు భారీ చిత్రాలు ఒక నెల తేడాతో విడుదల కావడంతో.. ఒకే సమయంలో రెండు మార్కెట్ పెంచుకునేందుకు రెడీ అయ్యింది.ఈ రెండు సినిమాలు హిట్ అయితే, ఆమెకు మరిన్ని అవకాశాలు, డిమాండ్ అంతకన్నా ఎక్కువగా వస్తాయని సినీ విశ్లేషకులు, ఫ్యాన్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.అలాగే, ఇక రుక్మిణి తెలుగు మూవీలో నటించనున్నది.జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ మూవీ తెరకెక్కనుండగా.. ఇందులోనూ హీరోయిన్గా ఎంపికైంది.త్వరలోనే ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లనున్నదిప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వస్తున్న మూవీ హిట్ అయితే ఈ అమ్మడు తెలుగులోనూ వరుస ఆఫర్లు దక్కించుకునే అవకాశాలున్నాయి.



# నా దేశానికి చెందిన ఏ సంస్కృతైనా నాదే

జాన్వీకపూర్ లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ మూవీ 'పరమ్ సుందరి' చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా విడుదల చేసిన ఈ సినిమా ట్రైలర్‌పై నెట్టింట ట్రోల్స్ వచ్చాయి. ఉత్తరాది అమ్మాయి అయిన జాన్విని మలయాళీగా చూపించడంపై పలువురు కేరళ నెటిజన్లు అసంతృప్తి వెలిబుచ్చారు. కేరళ నేపథ్య చిత్రంలో నటించేందుకు కేరళ హీరోయిన్లు లేరా? జాన్వీనే దొరికిందా? అంటూ ప్రశ్నలు సంధించారు. ఈ విషయంపై ఈ సినిమా ప్రమోషన్స్‌లో జాన్వీ మాట్లాడారు. 'అవును నేను ఉత్తరాది అమ్మాయినే.మలయాళీని కాను. ఆమాటకొస్తే మా అమ్మ శ్రీదేవి కూడా మలయాళీ కాదు. కానీ కేరళ సంస్కృతిపై నాకు అపారమైన గౌరవం ఉంది. ముఖ్యంగా మలయాళ చిత్రాలకు నేను అభిమానిని. 'పరమ్‌సుందరి' సినిమాలో నేను తమిళం అమ్మాయిగా కూడా కనిపిస్తా. అయినా నేను ఇండియన్‌ని. నా దేశానికి చెందిన ఏ సంస్కృతి అయినా నాదే.' అంటూ చెప్పుకొచ్చారు జాన్వీ కపూర్.

# పవన్ కళ్యాణ్ చేతిపై జపనీస్ టాటూ.. దాని అర్థం ఏంటో తెలుసా?




ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా రాజకీయ బాధ్యతలు నిర్వర్తిస్తున్న పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మరోవైపు తన సినిమాల పనుల్లోనూ జోరుగా ముందుకెళ్తున్నారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ఓజీ' (ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్) పై అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఈ సినిమాకు సంబంధించి ఇటీవల విడుదలైన రెండో పాట పోస్టర్ ఇప్పుడు ఆసక్తికరమైన చర్చకు దారితీసింది.దర్శకుడు సుజీత్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో పవన్ కల్యాణ్‌కు జోడీగా ప్రియాంక మోహన్ నటిస్తున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో, దీపాల వెలుతురు మధ్య రొమాంటిక్ మూడ్‌లో కనిపించిన ఈ జంట ప్రేక్షకుల మన్ననలు అందుకుంది. అయితే ఈ పోస్టర్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన అంశం మాత్రం పవన్ కల్యాణ్ చేతిపై కనిపించిన జపనీస్ టాటూ.సోషల్ మీడియాలో ఈ టాటూ పెద్ద చర్చనీయాంశంగా మారింది. అభిమానులు దాని అర్థం గూగుల్‌లో వెతుకుతూ అన్వేషణ మొదలుపెట్టారు. అందులో భాగంగా ఆ మూడు జపనీస్ అక్షరాలు వీటిని సూచిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది: మొదటి అక్షరం – వాగ్దానం, రెండో అక్షరం – బలం, మూడో అక్షరం– నిప్పు. ఈ మూడు పదాలు కలిపి పవన్ కల్యాణ్ 'ఓజీ'లో పోషిస్తున్న పాత్ర యొక్క లోతు, లక్ష్యం, మరియు ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తున్నాయని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, మొదటి పాట సినిమాపై భారీ హైప్‌ను సృష్టించగా, ఈ టాటూ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల విడుదలైన OG చిత్రం మొదటి పాట Fire Stor ఎంత సెన్సేషన్ క్రియేట్ చేసిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. OG థీమ్ సాంగ్ గా సాగిన పాట లిరిక్స్, థమన్ అందించిన క్యాచీ ట్యూన్ మ్యూజిక్ లవర్స్ ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక ప్రస్తుతం మేకర్స్ 2వ పాటను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో పాట వినాయక చవితి సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో విలన్ గా ఇమ్రాన్ హష్మీ నటిస్తున్నారు. సీనియర్ నటి శ్రియా రెడ్డి కీలక పాత్ర పోషిస్తోంది. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ చిత్రాన్ని థమన్ ఎస్ సంగీతం అందిస్తుండటం విశేషం. ఇక సెప్టెంబర్ 25, 2025న వరల్డ్ వైడ్ గా ప్రేక్షకుల ముందుకు రానుంది. మరోవైపు పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ ను పూర్తి చేసుకుంటున్నారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492